navajyothidaily.com

# నవజ్యోతి

తెలుగు దినపత్రిక

ప్రచురణ : తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | శనివారం, 12 సెప్టెంబరు 2026 | ఎడిటర్ : మన్నె లక్ష్మణ్ | సంపుటి : 1 సంచిక : 321 | పేజీలు : 8 | వెల : 5/-



2లో..

ప్రభుత్వ విద్యలో..
**సంస్కరణలు వేగవంతం**



3లో..

ట్రాన్స్‌జెండర్లకు
**కార్పొరేషన్లలో ప్రాతినిధ్యం**

# ఏఐతో ఉగ్రవాదానికి కొత్త రూపం

- దాడుల నుంచి భావజాల యుద్ధానికి మార్పు
- మహిళలు, చిన్నారులపై ప్రత్యేక గురి
- ఏఐతో వేగంగా విస్తరిస్తున్న ప్రచారం
- భద్రతా వ్యవస్థలకు కొత్త సవాళ్లు



**డెస్క్, 11 సెప్టెంబర్ (నవజ్యోతి ప్రతినిధి) :** ఐసిస్, అల్-ఖైదా వంటి అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థలు తమ కార్యకలాపాల పద్ధతిని పూర్తిగా మార్చుకున్నాయని ఐక్యరాజ్యసమితి తాజా నివేదిక వెల్లడించింది. గతంలో భౌతిక దాడులు, బాంబు పేలుళ్లు, ఆత్మాహుతి దాడుల ద్వారా భయాందోళనలు సృష్టించిన ఈ సంస్థలు ఇప్పుడు భావజాల వ్యాప్తి, రాడికలైజేషన్‌ను ప్రధాన ఆయుధంగా మలుచుకున్నాయని పేర్కొంది. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతను వినియోగిస్తూ ప్రపంచవ్యాప్తంగా తమ ప్రభావాన్ని విస్తరించేందుకు ప్రయత్నిస్తున్నాయని నివేదిక హెచ్చరించింది. ఈ మారుతున్న వ్యూహాలు ప్రపంచ భద్రతా వ్యవస్థలకు కొత్త సవాళ్లను విసురుతున్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఐక్యరాజ్యసమితికి చెందిన కౌంటర్-టెర్రరిజం కమిటీ (మిగతా.. 2లో)

## రైల్వే ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదం



- రూ.10,021 కోట్లతో ఐదు మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులు
- 540 కిలోమీటర్ల మేర రైలు మార్గాల సామర్థ్య పెంపు
- దక్షిణాది రాష్ట్రాలకు మెరుగైన రైలు కనెక్టివిటీ
- ప్రాజెక్టులను స్వాగతించిన సోము వీర్రాజు

2లో..

భూదందాలపై.. **సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు**

## రేవంత్ సర్కార్‌ను నిలదీసిన కేటీఆర్

- 22ఏ భూముల వ్యవహారంపై ఆరోపణలు
- కొండా సురేఖ తొలగింపుపై సంచలన వ్యాఖ్యలు
- తెలంగాణ భవన్‌లో బాధితులతో సమావేశం



**హైదరాబాద్, సెప్టెంబర్ 11 (నవజ్యోతి ప్రతినిధి) :** సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో 22ఏ నిషేధిత భూముల బాధితులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో భూములను కాపాడాల్సిన వారే భూకబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ ప్రభుత్వ తీరుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కాకముందు ఆర్టీఐని అడ్డం పెట్టుకుని బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేశారని, ప్రస్తుతం అధికారంలోకి వచ్చాక భూదందాలకు పాల్పడుతున్నారని కేటీఆర్ ఆరోపించారు. 22ఏ భూముల వ్యవహారంలో ఒక ముఠా పనిచేస్తోందని, దాని వెనుక అధికార వర్గాల ప్రమేయం ఉందని విమర్శించారు. ప్రభుత్వం తీసుకొస్తున్న పలు పథకాల వెనుక భూ కుంభకోణాలే ఉన్నాయని ఆరోపించారు. (మిగతా.. 3లో)

మాజీ హవల్దార్ అరెస్టుతో
## వీడిన మిస్టరీ

- బొల్లారం ఆర్మీ ఆయుధాల చోరీ కేసు ఛేదించిన పోలీసులు
- మాజీ హవల్దార్ మల్లేష్ అరెస్ట్
- పాతిపెట్టిన ఆయుధాలు, బుల్లెట్లు స్వాధీనం



**హైదరాబాద్, సెప్టెంబర్ 11 (నవజ్యోతి ప్రతినిధి):** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన బొల్లారం మద్రాస్ రెజిమెంట్ ఆర్మీ ఆయుధాల చోరీ కేసును తెలంగాణ పోలీసులు ఛేదించారు. ఈ కేసులో మాజీ హవల్దార్ ఉప్పుతోళ్ల మల్లేష్‌ను అరెస్ట్ చేసినట్లు డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. చోరీకి గురైన ఆయుధాలు, మ్యాగజైన్లు, బుల్లెట్లు, బైనాక్యులర్‌ను నిందితుడి స్వగ్రామం నుంచి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గత నెల 31న బొల్లారం మద్రాస్ రెజిమెంట్‌లోని కోట్ రూమ్, మ్యాగజైన్ రూమ్ నుంచి ఆయుధాలు, మందుగుండు సామగ్రి మాయమైన విషయం వెలుగులోకి వచ్చింది. నాలుగు ఏకే-47 రైఫిళ్లతో పాటు మొత్తం 12 ఆయుధాలు, పెద్ద మొత్తంలో బుల్లెట్లు చోరీకి గురైనట్లు అధికారులు గుర్తించారు. బ్రిగేడియర్ ఫిర్యాదుతో బొల్లారం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసు దర్యాప్తులో మిలిటరీ ఇంటెలిజెన్స్, ఆర్మీ అధికారులు, తెలంగాణ స్టేట్ ఇంటెలిజెన్స్, హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్, ఎస్‌వోటీ బృందాలు పాల్గొన్నాయి. కోట్‌కు యాక్సెస్ ఉన్న సిబ్బందితో పాటు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, సెలవుపై ఉన్న సిబ్బందిని కూడా విచారించారు. డాగ్ స్క్వాడ్, ఫింగర్‌ప్రింట్ నిపుణుల సహాయంతో పాటు దాదాపు 8 లక్షల మొబైల్ నంబర్లను విశ్లేషించి విచారణ చేపట్టారు. దర్యాప్తులో భాగంగా (మిగతా.. 2లో)



బ్రిక్స్ వేదికగా
## ఆర్థిక బంధాల బలోపేతం

- స్టార్టప్‌లకు ప్రపంచస్థాయి ఎకోసిస్టమ్ ఉందన్న ప్రధాని మోదీ
- 40 దేశాలతో స్వేచ్ఛాయుత వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకున్న భారత్
- బ్రిక్స్ దేశాలు భారత ఆవిష్కరణ వేదికలను వినియోగించుకోవాలని పిలుపు

3లో..

**విద్యా వ్యవస్థ వైఫల్యాలపై రాహుల్ ఆందోళన**



3లో..

వ్యవసాయ మోటార్లకు
## మీటర్లు పెట్టబోము : భట్టి

ఆర్డీఎస్ఎస్ పథకంలో అలాంటి నిబంధన లేదన్న డిప్యూటీ సీఎం

సోలార్ విద్యుత్, మైక్రో గ్రిడ్‌లపై ప్రభుత్వం దృష్టి



**హైదరాబాద్, సెప్టెంబర్ 11 (నవజ్యోతి ప్రతినిధి):** రాష్ట్రంలోని రైతుల వ్యవసాయ మోటార్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ మీటర్లు ఏర్పాటు చేయబోమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. శాసనమండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ ఈ విషయాన్ని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డీఎస్ఎస్ పథకంలో ఎక్కడా వ్యవసాయ మోటార్లకు మీటర్లు ఏర్పాటు చేయాలనే నిబంధన లేదని, రైతుల్లో అనవసర భయాందోళనలు సృష్టించవద్దని సూచించారు. రాష్ట్రంలో 29 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు ఉచిత విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం ఏటా రూ.14 వేల కోట్లు ఖర్చు చేస్తోందని భట్టి తెలిపారు. అలాగే 53 లక్షల గృహ వినియోగదారులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించేందుకు మరో రూ.5 వేల కోట్లు వెచ్చిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ విధంగా సబ్సిడీల రూపంలో ప్రతి ఏడాది దాదాపు రూ.19 వేల కోట్లు ఖర్చవుతున్నాయని వివరించారు. ఈ నిధులను సోలరైజేషన్ వైపు మళ్లిస్తే ప్రభుత్వ ఖజానాపై భారం తగ్గడంతో పాటు రైతులు స్వయం సమృద్ధి సాధించే అవకాశం ఉంటుందని భట్టి అభిప్రాయపడ్డారు. పగటిపూట లభించే సోలార్ విద్యుత్‌ను రాత్రి వేళల్లో కూడా వినియోగించుకునేలా బ్యాటరీ స్టోరేజ్ సిస్టమ్‌లతో మైక్రో గ్రిడ్‌లను ఎంపిక చేసిన గ్రామాల్లో ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అందించే వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ సహాయంతో ఈ ప్రాజెక్టులను అమలు చేయాలని ప్రయత్నించినప్పటికీ బ్యాటరీ స్టోరేజ్ ఖర్చులు అధికంగా ఉండటంతో (మిగతా.. 2లో)

# హైడ్రా అధికారిక పోర్టల్ ప్రారంభం

- హైడ్రా వెబ్‌సైట్‌ను ప్రారంభించిన కమిషనర్ ఏవీ రంగనాథ్
- ఒకే వేదికపై పౌర సేవలు, విపత్తు నిర్వహణ సమాచారం

## అత్యవసర సహాయం కోసం అందుబాటులో 1070 హెల్ప్‌లైన్



**హైదరాబాద్, సెప్టెంబర్ 11, (నవజ్యోతి ప్రతినిధి):** హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) అందిస్తున్న సేవలు, కార్యక్రమాలు, విపత్తు నిర్వహణకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు హైడ్రా అధికారిక వెబ్‌సైట్‌ను కమిషనర్ ఏవీ రంగనాథ్ శుక్రవారం ప్రారంభించారు. draa.telangana.gov.in పేరిట రూపొందించిన ఈ పోర్టల్ ద్వారా హైడ్రా సేవలు, భూములు, చెరువులు, అధికార పరిధి, అత్యవసర సహాయ వ్యవస్థ తదితర వివరాలను తెలుసుకునే అవకాశం కల్పించారు. పోర్టల్‌లో హైడ్రా 24 గంటల అత్యవసర హెల్ప్‌లైన్ 1070 వివరాలను ప్రముఖంగా పొందుపరిచారు. చెట్లు కూలిపోవడం, అగ్నిప్రమాదాలు, రహదారులపై నీరు నిల్వ ఉండడం, వరదలు, సహాయక చర్యలు వంటి విపత్తు సంబంధిత అత్యవసర పరిస్థితులపై ప్రజలు ఈ నంబర్‌కు సమాచారం అందించవచ్చని అధికారులు తెలిపారు. ఫైర్ సేఫ్టీ ఎన్‌వోసీల కోసం ఆన్‌లైన్ దరఖాస్తు సౌకర్యాన్ని కూడా పోర్టల్‌లో అందుబాటులో ఉంచారు. భవన యజమానులు, నిర్మాణదారులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించడంతో పాటు వాటి ప్రగతిని ఎప్పటికప్పుడు పరిశీలించుకునే వీలుంటుంది. సంబంధిత అధికారులు కూడా డ్యాష్‌బోర్డు ద్వారా దరఖాస్తులను పరిశీలించి చర్యలు తీసుకోగలుగుతారు. భారీ వర్షాలు, వరదల సమయంలో నీరు నిలిచే ప్రాంతాలకు సంబంధించిన సమాచారాన్ని ప్రత్యేకంగా అందుబాటులో ఉంచారు. జీహెచ్‌ఎంసీ, సీఎంసీ, ఎంఎంసీ కమిషనరేట్ల పరిధిలోని వాటర్‌లాగింగ్ ప్రాంతాలు, వరద ప్రభావిత ప్రాంతాల మ్యాప్‌లను ప్రజలు పరిశీలించవచ్చు.

దీంతో వర్షాకాలంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకునేందుకు అవకాశం లభిస్తుంది. లైవ్ రైన్‌ఫాల్ మ్యాప్స్, రోజువారీ వర్షపాతం వివరాలు, వాతావరణ అంచనాలు, డాప్లర్ రాడార్ సమాచారం కూడా పోర్టల్‌లో అందుబాటులో ఉంటుంది. అలాగే హెచ్‌ఎండీఏ లేక్స్ పోర్టల్‌కు లింక్ ద్వారా చెరువుల ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్), బఫర్ జోన్ నిబంధనలు, జలాశయాల వివరాలను తెలుసుకునే సౌకర్యం కల్పించారు. భూముల కొనుగోలు, లావాదేవీలకు ముందు భూ భారతి పోర్టల్ ద్వారా భూ రికార్డులను పరిశీలించే అవకాశం కూడా ఉంది. చెరువుల పరిరక్షణ, పునరుద్ధరణ కార్యక్రమాలు, అధికారిక ప్రకటనలు, ప్రెస్ రిలీజ్‌లు, ఫోటోలు, వీడియోలు, క్షేత్రస్థాయి కార్యకలాపాలకు సంబంధించిన సమాచారాన్ని న్యూస్, ఫ్లాష్ న్యూస్ విభాగాల ద్వారా ప్రజలకు అందుబాటులో ఉంచారు. హైడ్రా చేపడుతున్న సేవలు, విపత్తు నిర్వహణ చర్యలు, ప్రజా ప్రయోజన కార్యక్రమాలపై తాజా సమాచారాన్ని ఒకేచోట తెలుసుకునేందుకు ఈ పోర్టల్ ఉపయోగపడనుంది.



## రైల్వే ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదం

**అమరావతి, సెప్టెంబర్ 11 (నవజ్యోతి ప్రతినిధి) :** ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశంలో రైల్వే మౌలిక సదుపాయాల అభివృద్ధి కొత్త శిఖరాలను చేరుకుంటోందని బీజేపీ నాయకుడు సోము వీర్రాజు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం రూ.10,021 కోట్ల వ్యయంతో ఐదు కీలక రైల్వే మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులకు ఆమోదం తెలపడం శుభపరిణామమని అన్నారు. ఈ ప్రాజెక్టులు దేశ ఆర్థికాభివృద్ధికి, రవాణా రంగ పురోగతికి దోహదపడతాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన ప్రాజెక్టుల ద్వారా 540 కిలోమీటర్ల మేర రైల్వే మార్గాల సామర్థ్యం పెరుగుతుందని సోము వీర్రాజు పేర్కొన్నారు. అరక్కోణం--రేణిగుంట, వైట్‌ఫీల్డ్--బంగారుపేట, హోసూరు--ఓమల్లూరు, సేలం--కరూరు--దిండిగల్, సికింద్రాబాద్--కాజీపేట మార్గాల్లో మల్టీట్రాకింగ్, డబ్లింగ్ పనులు చేపట్టనున్నట్లు వివరించారు. ఈ పనులతో రైళ్ల రాకపోకలు మరింత సులభతరం కానున్నాయని తెలిపారు. ఈ ప్రాజెక్టుల వల్ల ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు దక్షిణ భారత రాష్ట్రాల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. మొత్తం 17 జిల్లాలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరనుండగా, 2,121 గ్రామాలకు మెరుగైన రైలు కనెక్టివిటీ లభించనుందని తెలిపారు. ప్రాంతీయ అభివృద్ధికి కూడా ఈ ప్రాజెక్టులు దోహదపడతాయని అన్నారు. దాదాపు 52 లక్షల మందికి ఉన్నత స్థాయి రైలు సేవలు అందుబాటులోకి రావడంతో పాటు సరకు రవాణా సామర్థ్యం కూడా గణనీయంగా పెరుగుతుందని సోము వీర్రాజు పేర్కొన్నారు. అదనంగా 47 మిలియన్ టన్నుల వార్షిక సరకు రవాణా సామర్థ్యం ఏర్పడుతుందని చెప్పారు. దీనివల్ల పరిశ్రమలు, వాణిజ్య రంగాలకు ఊతం లభిస్తుందని అభిప్రాయపడ్డారు. రైల్వే వ్యవస్థ ఆధునీకరణతో ప్రయాణికులకు సురక్షితమైన, వేగవంతమైన ప్రయాణ సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. రవాణా ఖర్చులు తగ్గడంతో పాటు సరకు రవాణా వేగం పెరిగి ఆర్థిక కార్యకలాపాలు మరింత విస్తరించే అవకాశం ఉందన్నారు. దేశ అభివృద్ధిలో రైల్వే రంగం కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రైల్వే మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ప్రభుత్వానికి సోము వీర్రాజు కృతజ్ఞతలు తెలిపారు. వికసిత భారత్ లక్ష్య సాధనలో ఇలాంటి ప్రాజెక్టులు కీలకమని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా కనెక్టివిటీ, ఆర్థిక పురోగతికి ఇవి బలమైన పునాదులు వేస్తాయని అభిప్రాయపడ్డారు.

## వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టబోము : భట్టి



(మొదటి పేజీ తరువాయి..)

ఆశించిన స్థాయిలో స్పందన రాలేదన్నారు. భవిష్యత్తులో సాంకేతికత అభివృద్ధి చెందడంతో బ్యాటరీల ధరలు తగ్గితే ఈ ప్రాజెక్టులు మరింత వేగంగా ముందుకు సాగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ నిరంతరం పెరుగుతోందని భట్టి విక్రమార్క తెలిపారు. 2014లో రాష్ట్ర విద్యుత్ డిమాండ్ 15,497 మెగావాట్లు ఉండగా ప్రస్తుతం అది 19,543 మెగావాట్లకు చేరిందన్నారు. ఈ ఏడాది డిమాండ్ 20 వేల నుంచి 21 వేల మెగావాట్ల వరకు పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని సంప్రదాయ, సాంప్రదాయేతర ఇంధన వనరులను సమన్వయం చేస్తూ తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ--2025ను అమలు చేస్తున్నట్లు తెలిపారు. భారీ విద్యుత్ డిమాండ్ ఉన్నప్పటికీ రాష్ట్రంలో నాణ్యమైన విద్యుత్ సరఫరాను కొనసాగిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి చెప్పారు. విద్యుత్ ప్రసార వ్యవస్థలో ఉన్న లోపాలను సరిదిద్దేందుకు కేంద్ర సహకారంతో చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. రైతులకు ఉచిత విద్యుత్ అందించడంలో ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని, వ్యవసాయ మోటార్లకు మీటర్లు ఏర్పాటు చేసే ప్రసక్తే లేదని మరోసారి స్పష్టం చేశారు.

## ప్రభుత్వ విద్యలో సంస్కరణలు వేగవంతం

- ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ విద్యకు ప్రాధాన్యం
- విద్యార్థులు, ఉపాధ్యాయులకు పోషకాహార భోజనాల ఏర్పాటు
- విద్యా ప్రమాణాల పెంపుపై సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు



**హైదరాబాద్, సెప్టెంబర్ 11, (నవజ్యోతి ప్రతినిధి) :** తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి పలు కీలక సంస్కరణలను అమలు చేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. శాసనసభలో మాట్లాడిన ఆయన, ప్రైవేటు విద్యాసంస్థల వైపు తల్లిదండ్రులు ఆకర్షితులు కావడానికి గల ప్రధాన కారణాలను విశ్లేషిస్తూ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. చిన్న వయసులోనే పిల్లలకు విద్య అందించే విధానాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు. ప్రైవేటు విద్యా వ్యవస్థలో రెండున్నరేళ్ల వయసు నుంచే పిల్లలను పాఠశాలలకు పంపుతున్నారని, అయితే ప్రభుత్వ విద్యా వ్యవస్థలో ఐదేళ్ల తర్వాత మాత్రమే పాఠశాలల్లో ప్రవేశం కల్పిస్తున్న పరిస్థితి గతంలో ఉండేదని సీఎం వివరించారు. నర్సరీ, ఎల్‌కేజీ విధానాలతో పాటు ఇంగ్లీష్ భాషా బోధనకు తల్లిదండ్రులు అధిక ప్రాధాన్యం ఇస్తుండటంతో ప్రైవేటు పాఠశాలల వైపు మొగ్గు చూపుతున్నారని తెలిపారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ పాఠశాలల్లో తొలిసారిగా ప్రీ ప్రైమరీ విద్యా విధానాన్ని ప్రారంభించినట్లు రేవంత్ రెడ్డి వెల్లడించారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా సుమారు 64 వేల మంది చిన్నారులు ప్రీ ప్రైమరీ విద్యను అభ్యసిస్తున్నారని చెప్పారు. చిన్న వయసు లోనే నాణ్యమైన విద్య అందించడం ద్వారా ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసాన్ని మరింత పెంచడమే లక్ష్యమన్నారు. విద్యార్థుల ఆరోగ్యం, పోషకాహారంపై కూడా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకు కూడా మధ్యాహ్న భోజన సదుపాయం కల్పిస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు పోషకాహారంతో కూడిన ఆహారం అందించడం ద్వారా వారి శారీరక, మానసిక వికాసానికి తోడ్పడుతున్నామని వివరించారు. రాష్ట్రంలో సెంట్రలైజ్డ్ కిచెన్లను రూపొందించి పరిశుభ్రమైన, నాణ్యమైన బ్రేక్‌ఫాస్ట్ మరియు భోజనాన్ని అందిస్తున్నామని సీఎం చెప్పారు. హైజీనిక్ విధానంలో తయారైన ఆహారం విద్యార్థులకు చేరేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. పిల్లల ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు విద్యా ఫలితాలపై కూడా ఇది సానుకూల ప్రభావం చూపుతుందని అభిప్రాయపడ్డారు. గత పదేళ్లలో విద్యారంగంలో నిర్లక్ష్యం జరిగిందని విమర్శించిన రేవంత్ రెడ్డి, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే డైట్ ఛార్జీలు, కాస్మోటిక్ ఛార్జీలను పెంచి విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలు ప్రభుత్వ విద్యను మరింత ఆకర్షణీయంగా మార్చడమే కాకుండా, విద్యార్థులకు మెరుగైన భవిష్యత్తును అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన స్పష్టం చేశారు.

## మాజీ హవల్దార్ అరెస్టుతో వీడిన మిస్టరీ



(మొదటి పేజీ తరువాయి..)

నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన మాజీ హవల్దార్ ఉప్పుతోళ్ల మల్లేష్‌పై అనుమానం బలపడింది. 2010లో సైన్యంలో చేరిన మల్లేష్ ఈ ఏడాది జూన్ 30న పదవీ విరమణ పొందాడు. ముందస్తు రిటైర్మెంట్‌పై ఉన్న అసంతృప్తితోనే ఈ చోరీకి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. సీసీ కెమెరా దృశ్యాలు, ఫోన్ డేటా ఆధారాలతో అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించినట్లు తెలిపారు. చోరీ చేసిన ఆయుధాలు, బుల్లెట్లను నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలోని తన స్వగ్రామానికి తీసుకెళ్లి గుంత తీసి పాతిపెట్టినట్లు మల్లేష్ ఒప్పుకున్నాడని డీజీపీ తెలిపారు. అతడు చూపించిన ప్రదేశంలో తవ్వకాలు చేపట్టి ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఫోన్ కాల్ వివరాలు, వాట్సాప్ చాటింగ్‌లను డిలీట్ చేయడం ద్వారా ఆధారాలు చెరిపివేయడానికి ప్రయత్నించినట్లు చెప్పారు. కేసు ఛేదనలో పాల్గొన్న పోలీసు బృందాలను డీజీపీ అభినందించారు. దేశ భద్రతకు సంబంధించిన అంశం కావడంతో అత్యంత ప్రాధాన్యతతో విచారణ చేపట్టామని, అన్ని ఆయుధాలను సురక్షితంగా స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలపై తదుపరి విచారణ కొనసాగుతోందన్నారు.

## ఏఐతో ఉగ్రవాదానికి కొత్త రూపం

(మొదటి పేజీ తరువాయి..)

ఎగ్జిక్యూటివ్ డైరెక్టరేట్ (సీటీఈడీ) విడుదల చేసిన నివేదిక ప్రకారం, ఉగ్రవాద సంస్థలు జెనరేటివ్ ఏఐ సహాయంతో ప్రచార కంటెంట్‌ను వేగంగా తయారు చేస్తున్నాయి. పురుషులు, మహిళలు, యువత, చిన్నారులు వంటి వర్గాల మానసిక స్థితిని అంచనా వేసి వారికి అనుగుణంగా ప్రత్యేక సందేశాలను రూపొందిస్తున్నాయి. సోషల్ మీడియా, డిజిటల్ వేదికలు, మెసేజింగ్ యాప్‌ల ద్వారా ఈ ప్రచారాన్ని మరింత వేగంగా విస్తరిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా తమ భావజాలాన్ని వ్యాప్తి చేసి ఇస్లామిక్ రాజ్య స్థాపన లక్ష్యాన్ని సాధించడమే ఈ ప్రయత్నాల వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశమని నివేదిక స్పష్టం చేసింది. మహిళలు, యువతులు, చిన్నారులే ప్రస్తుతం ఈ ప్రచారానికి ప్రధాన లక్ష్యంగా మారడం ఆందోళన కలిగించే అంశంగా మారింది. మహిళలకు రక్షణ, సామాజిక గుర్తింపు, గౌరవం వంటి అంశాలను ప్రస్తావిస్తూ వారిని ఆకర్షించేందుకు ప్రయత్నిస్తున్నట్లు నివేదిక పేర్కొంది. మరోవైపు యువకులను హింస, పోరాటం ద్వారానే శక్తి, గౌరవం, గుర్తింపు లభిస్తాయనే భావజాలంతో ప్రభావితం చేస్తున్నట్లు వెల్లడించింది. చిన్నారుల విషయంలో వారి అమాయకత్వాన్ని, మానసిక బలహీనతలను ఆసరాగా చేసుకుని చిన్న వయసులోనే తీవ్రవాద భావజాలాన్ని నాటే ప్రయత్నాలు జరుగుతున్నాయని హెచ్చరించింది. భారత ఇంటెలిజెన్స్ బ్యూరో అధికారులు కూడా ఈ పరిణామాలను ధ్రువీకరించినట్లు సమాచారం. భారత్‌లో ఐసిస్, అల్-ఖైదా వంటి సంస్థలు ఏఐ ఆధారిత ప్రచారాన్ని వినియోగిస్తూ మహిళలు, చిన్నారులను లక్ష్యంగా చేసుకున్నాయని అధికారులు వెల్లడించారు. డిజిటల్ వేదికల ద్వారా వ్యక్తిగత స్థాయిలో చేరువ కావడం, వారి ఆసక్తులకు అనుగుణంగా కంటెంట్ పంపించడం, భావోద్వేగాలను ప్రభావితం చేయడం వంటి వ్యూహాలను అనుసరిస్తున్నట్లు గుర్తించారు. ఈ విధంగా రాడికలైజేషన్‌కు గురైన వ్యక్తులను సంప్రదాయ నిఘా వ్యవస్థల ద్వారా గుర్తించడం మరింత క్లిష్టంగా మారుతోందని అధికారులు పేర్కొంటున్నారు. దక్షిణ భారతదేశంలో ఈ ఏఐ ఆధారిత ప్రచార నమూనాను ఉగ్రవాద సంస్థలు మరింత సమర్థంగా వినియోగిస్తున్నట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. భావజాల ప్రభావానికి లోనైన వ్యక్తులు నేరుగా హింసాత్మక చర్యలకు పాల్పడకుండా సాధారణ జీవితాన్ని కొనసాగిస్తుండటంతో వారిని గుర్తించడం కష్టసాధ్యంగా మారుతోంది. ఆన్‌లైన్ వేదికల ద్వారా నిశ్శబ్దంగా ప్రచారం నిర్వహించడం, కొత్త వ్యక్తులను ప్రభావితం చేయడం వంటి చర్యలు భద్రతా సంస్థలకు పెద్ద సవాలుగా మారాయి. దీంతో సైబర్



నిఘా వ్యవస్థలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. భవిష్యత్తులో లష్కరే తోయిబా, జైషే మహమ్మద్ వంటి ఇతర ఉగ్రవాద సంస్థలు కూడా ఇదే తరహా వ్యూహాలను అనుసరించే ప్రమాదం ఉందని భద్రతా నిపుణులు హెచ్చరిస్తున్నారు. కృత్రిమ మేధస్సు మానవ అభివృద్ధికి ఉపయోగపడే శక్తివంతమైన సాధనమైనప్పటికీ, దాని దుర్వినియోగం ప్రపంచ భద్రతకు తీవ్రమైన ముప్పుగా మారే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. ఉగ్రవాద భావజాల వ్యాప్తిని అడ్డుకునేందుకు ప్రభుత్వాలు, సాంకేతిక సంస్థలు, విద్యా వ్యవస్థలు, కుటుంబాలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు. డిజిటల్ యుగంలో ఉగ్రవాదం కొత్త రూపాలు సంతరించుకుంటున్న నేపథ్యంలో అప్రమత్తత, అవగాహన, సమర్థ నిఘా వ్యవస్థలే దీనికి సమాధానమని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

# ట్రాన్స్‌జెండర్లకు కార్పొరేషన్లలో ప్రాతినిధ్యం

- మున్సిపల్ కార్పొరేషన్లలో కో-ఆప్షన్ సభ్యులుగా అవకాశం
- తెలంగాణ మున్సిపాలిటీల సవరణ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం

## ప్రజా జీవితంలో భాగస్వామ్యం పెంపునకు ప్రభుత్వం నిర్ణయం



**హైదరాబాద్, సెప్టెంబర్ 11 (నవజ్యోతి ప్రతినిధి):** ట్రాన్స్‌జెండర్ల సాధికారత దిశగా తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లలో ట్రాన్స్‌జెండర్లకు కో-ఆప్షన్ సభ్యులుగా ప్రాతినిధ్యం కల్పించే బిల్లుకు తెలంగాణ శాసనసభ శుక్రవారం ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో పురపాలక పరిపాలన, విధాన నిర్ణయాల్లో ట్రాన్స్‌జెండర్ల భాగస్వామ్యానికి మార్గం సుగమమైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తరఫున శాసనసభా వ్యవహారాల మంత్రి డి. శ్రీధర్ బాబు 'తెలంగాణ మున్సిపాలిటీల (నాలుగో సవరణ) బిల్లు--2026'ను సభలో ప్రవేశపెట్టారు. 2019లో అమల్లోకి వచ్చిన తెలంగాణ మున్సిపాలిటీల చట్టానికి ఈ బిల్లు సవరణలు ప్రతిపాదిస్తోంది. సవరణల ప్రకారం హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధి వెలుపల ఉన్న తొమ్మిది మున్సిపల్ కార్పొరేషన్లలో ఒక్కో ట్రాన్స్‌జెండర్‌ను నామినేటెడ్ సభ్యునిగా కో-ఆప్ట్ చేసుకునే అవకాశం కల్పించనున్నారు. దీంతో స్థానిక సంస్థల పాలనలో ట్రాన్స్‌జెండర్ వర్గానికి ప్రత్యక్ష ప్రాతినిధ్యం లభించనుంది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, సామాజిక వివక్షకు గురవుతున్న ట్రాన్స్‌జెండర్లను ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడంతో పాటు ప్రజా జీవితంలో వారి పాత్రను మరింత బలోపేతం చేయడమే ఈ నిర్ణయ లక్ష్యమని తెలిపారు. సమానత్వం, సామాజిక న్యాయం సాధనలో భాగంగా ప్రభుత్వం ఈ సంస్కరణను తీసుకొచ్చిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ఈ చట్ట సవరణను రూపొందించినట్లు మంత్రి వెల్లడించారు. ట్రాన్స్‌జెండర్ సమాజానికి గౌరవప్రదమైన స్థానం కల్పించడంతో పాటు పాలనలో భాగస్వామ్యం పెంచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ బిల్లుకు బీజేపీ, సీపీఐ సహా వివిధ రాజకీయ పార్టీల సభ్యులు మద్దతు ప్రకటించారు. అనంతరం శాసనసభ ఈ బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ నిర్ణయం ట్రాన్స్‌జెండర్ల సామాజిక, రాజకీయ సాధికారతకు దోహదపడటమే కాకుండా స్థానిక పాలనలో సమగ్ర భాగస్వామ్యానికి కొత్త దారులు తెరుస్తుందని ప్రభుత్వం అభిప్రాయపడుతోంది.

# బ్రిక్స్ వేదికగా ఆర్థిక బంధాల బలోపేతం



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11, (నవజ్యోతి ప్రతినిధి):** ప్రపంచవ్యాప్తంగా వాణిజ్యపరమైన ఆంక్షలు పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో భారత్ మాత్రం ఇతర దేశాలతో ఆర్థిక సంబంధాలను బలోపేతం చేసే దిశగా ముందుకు సాగుతోందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఢిల్లీలో నిర్వహించిన బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, భారత్ ఆర్థిక వారధులను నిర్మిస్తూ ప్రపంచ దేశాలతో భాగస్వామ్యాన్ని విస్తరిస్తోందన్నారు. వాణిజ్యానికి అడ్డంకులను తొలగించి కొత్త అవకాశాలను సృష్టించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. 2014 నుంచి ఇప్పటివరకు భారత్ దాదాపు 40 దేశాలతో స్వేచ్ఛాయుత వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకుందని ప్రధాని తెలిపారు. వ్యవసాయం, ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధి, స్మార్ట్ గ్రిడ్స్ వంటి కీలక రంగాల్లో బ్రిక్స్ దేశాల మధ్య సహకారాన్ని మరింత విస్తరించేందుకు భారత్ కృషి చేస్తోందన్నారు. బ్రిక్స్‌కు అధ్యక్షత వహిస్తున్న సందర్భంలో కొత్త సహకార నెట్‌వర్క్‌లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. భారత్‌లో స్టార్టప్‌లు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ప్రపంచస్థాయి ఎకోసిస్టమ్ అందుబాటులో ఉందని మోదీ పేర్కొన్నారు. ఈ రంగాలకు మరింత ప్రోత్సాహం అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ఆవిష్కరణలు, సాంకేతికత, పారిశ్రామికాభివృద్ధికి అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించడం ద్వారా యువతకు విస్తృత అవకాశాలు కల్పిస్తున్నామని వివరించారు. బ్రిక్స్ ఇంక్యుబేటర్ నెట్‌వర్క్, బ్రిక్స్ ఎంఎస్ఎంఈ పోర్టల్, బ్రిక్స్ స్టార్టప్ ఇన్నోవేషన్ ఫండ్ వంటి వినూత్న వేదికలను ప్రారంభించినట్లు ప్రధాని తెలిపారు. ఈ వేదికలను బ్రిక్స్ సభ్య దేశాల ప్రతినిధులు విస్తృతంగా వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. పరస్పర సహకారంతో కొత్త ఆవిష్కరణలు, వ్యాపార అవకాశాలు మరింత పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. 2006లో నాలుగు దేశాలతో ప్రారంభమైన బ్రిక్స్ ప్రయాణం ప్రస్తుతం 21 దేశాల కుటుంబంగా విస్తరించిందని మోదీ గుర్తు చేశారు. సభ్య దేశాలు, భాగస్వామ్య దేశాలు కలిసి ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. బ్రిక్స్ వేదిక ప్రపంచ అభివృద్ధికి, ఆర్థిక సహకారానికి ముఖ్యమైన శక్తిగా ఎదిగిందన్నారు. ప్రస్తుతం ప్రపంచ జనాభాలో సుమారు 50 శాతం మంది బ్రిక్స్ దేశాల్లోనే నివసిస్తున్నారని, ప్రపంచ జీడీపీలో 40 శాతం, అంతర్జాతీయ వాణిజ్యంలో 25 శాతానికిపైగా వాటా ఈ దేశాలదేనని ప్రధాని వివరించారు. పరస్పర సహకారం, ఆర్థిక భాగస్వామ్యాల ద్వారా ప్రపంచ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో బ్రిక్స్ కీలక పాత్ర పోషిస్తుందని ఆయన పేర్కొన్నారు.

# విద్యా వ్యవస్థ వైఫల్యాలపై రాహుల్ ఆందోళన

- యువతను నిరాశపరుస్తోందన్న కాంగ్రెస్ నేత
- పేపర్ లీకులు, అధిక ఫీజులపై విమర్శలు

## విద్యార్థుల అనుభవాలు పంచుకోవాలని పిలుపు



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11, (నవజ్యోతి ప్రతినిధి): భారత విద్యా వ్యవస్థపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. లక్షలాది మంది యువత నిజాయతీగా కష్టపడుతున్నప్పటికీ, ప్రస్తుత విద్యా వ్యవస్థ వారిని నిరాశపరుస్తోందని విమర్శించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రతిరోజూ ఎదుర్కొంటున్న సమస్యలను అర్థం చేసుకుని వాటికి పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. విద్యా వ్యవస్థలో చోటుచేసుకుంటున్న పేపర్ లీకులు, అధిక ఫీజులు, శిథిలావస్థకు చేరుతున్న మౌలిక సదుపాయాలు వంటి అంశాలపై రాహుల్ గాంధీ ఎక్స్ వేదికగా స్పందించారు. భవిష్యత్ తరాలను ఉన్నత స్థాయికి తీసుకెళ్లాల్సిన వ్యవస్థే వారిని వెనక్కి నెడుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆశయాలు, కలలు నెరవేరేలా విద్యా వ్యవస్థ పనిచేయాల్సి ఉండగా, అనేక లోపాల కారణంగా యువత ఇబ్బందులు ఎదుర్కొంటోందన్నారు. విద్యా వ్యవస్థలోని సమస్యలను సరిదిద్దాలంటే ముందుగా వాటిని ప్రత్యక్షంగా అనుభవిస్తున్న వారి స్వరాన్ని వినాలని రాహుల్ అభిప్రాయపడ్డారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తమ అనుభవాలను తనతో పంచుకోవాలని కోరారు. ఈ మేరకు విద్యా వ్యవస్థలోని లోపాలకు సంబంధించిన వివరాలను అందించేందుకు ప్రత్యేక ఆన్‌లైన్ లింక్‌ను కూడా ఆయన పంచుకున్నారు. దేశవ్యాప్తంగా యువత సమస్యలను తెలుసుకునేందుకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 'ఛాత్రోం కీ గూంజ్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రాహుల్ తెలిపారు. ఇప్పటికే కోటా, డేహ్రాడూన్, ప్రయాగ్‌రాజ్, పుణే నగరాల్లో సమావేశాలు నిర్వహించినట్లు వెల్లడించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవడం ద్వారా విద్యా రంగ సంస్కరణలకు మార్గం సుగమమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ నెల 19న మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో మరో సమావేశం నిర్వహించనున్నట్లు రాహుల్ ప్రకటించారు. దేశంలోని ప్రతి విద్యార్థి స్వరం వినిపించాల్సిన అవసరం ఉందని, కొద్దిమంది అభిప్రాయాలతో మాత్రమే సమస్యలకు పరిష్కారం దొరకదని పేర్కొన్నారు. యువత ఎదుర్కొంటున్న సవాళ్లను అర్థం చేసుకుని వాటికి తగిన పరిష్కారాలు కనుగొనడం అత్యవసరమని అన్నారు. ప్రస్తుత విద్యా వ్యవస్థ యువత ఆశలను దెబ్బతీస్తోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేసే సమస్యలపై దేశవ్యాప్తంగా చర్చ జరగాల్సిన అవసరం ఉందని, అందరూ కలిసి విద్యా రంగాన్ని బలోపేతం చేసే దిశగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. యువత ఆకాంక్షలకు అనుగుణంగా విద్యా వ్యవస్థను తీర్చిదిద్దడం దేశ భవిష్యత్తుకు కీలకమని ఆయన పేర్కొన్నారు.

## ఐటీ, ఏఐ రంగాల్లో

# భారత్ దూసుకెళ్తోంది : పుతిన్




**ఇంటర్నెట్ డెస్క్ (నవజ్యోతి):** ప్రపంచంలో బ్రిక్స్ కూటమికి ప్రాధాన్యత పెరుగుతోందని, ప్రపంచ జీడీపీలో 40శాతం బ్రిక్స్ దేశాల నుంచే వస్తోందని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో సగానికిపైగా ఈ దేశాలదేనని తెలిపారు. ఈ కూటమి ప్రపంచానికి దారి చూపిస్తోందని చెప్పారు. దిల్లీలో జరిగిన బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్‌లో ప్రసంగించిన పుతిన్.. ఐటీ, ఏఐ రంగాల్లో భారత్ దూసుకెళ్తోందని అన్నారు.

**పుతిన్‌కు కానుకగా 'తిరుక్కురళ్'.. ఏమిటిది?**

బ్రిక్స్ దేశాల్లో పట్టణీకరణ వేగంగా సాగుతోందని, ఇది ప్రపంచ ఆర్థిక రంగానికి ఊతమిస్తోందని పుతిన్ పేర్కొన్నారు. ఐటీ, ఏఐ రంగాల్లో భారత్ దూసుకెళ్తుండగా.. టెక్నాలజీ దిగ్గజాలుగా చైనా కంపెనీలు గుర్తింపు పొందుతున్నాయని అన్నారు. మరోవైపు ఏరోస్పేస్ రంగాల్లో బ్రెజిల్ సత్తా చాటుతోందని తెలిపారు. ఇలా బ్రిక్స్ కూటమి దేశాల నుంచి విజయగాథలు వెలుగులోకి వస్తున్నాయని, పశ్చిమ దేశాలతో ఇవి పోటీ పడుతున్నాయని అన్నారు. ఇదే సమయంలో ఇరాన్‌పై బహుముఖంగా దాడి జరుగుతోందన్న ఆయన.. అంతర్జాతీయ రవాణాకు ఆటంకం కలిగించడమే కాకుండా ఆ దేశంపై అక్రమంగా ఆంక్షలు కూడా విధిస్తున్నారంటూ మండిపడ్డారు.

**అస్థిర పరిస్థితుల్లోనూ సుస్థిరంగా భారత్ : మోదీ**

2006లో నాలుగు దేశాలతో బ్రిక్స్ ప్రస్థానం మొదలైందని.. ఇప్పుడు 21దేశాలకు విస్తరించిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ప్రపంచ జనాభాలో సగం ఈ దేశాల్లోనే ఉందని, ప్రపంచ వాణిజ్యంలో వీటి వాటా 25శాతం అని అన్నారు. బిజినెస్ ఫోరమ్‌లో ప్రసంగించిన ఆయన.. నూతన ఆవిష్కరణలు, సహకారం, సుస్థిరాభివృద్ధికి ఈ దేశాలు ఆలంబనగా నిలుస్తున్నాయన్నారు. ఈ క్రమంలో అభివృద్ధి, సుస్థిరతకు భారత్ చిరునామాగా మారిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. రోడ్లు, రైళ్లు, విమానాశ్రయాల వంటి మౌలిక సదుపాయాల కల్పనలో భారత్ వేగంగా ముందడుగు వేస్తోందని, సెమీకండక్టర్లు, క్వాంటమ్, నౌకా నిర్మాణం, బయోటెక్నాలజీ రంగాల్లో కొత్త పుంతలు తొక్కుతోందన్నారు. అస్థిర పరిస్థితుల్లోనూ సుస్థిర అభివృద్ధిని సాధిస్తూ భారత్ ముందుకెళ్తోందని చెప్పారు. ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలకు భారత్ పరిష్కారం చూపిస్తోందన్న మోదీ.. తమ స్టార్టప్‌లు ప్రపంచానికి ఆదర్శనీయమని ఉద్ఘాటించారు.



## భూదందాలపై..

# రేవంత్ సర్కార్‌ను నిలదీసిన కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి..)

హిల్ట్ పాలసీ, మూసీ రివర్‌ఫ్రంట్, ఫ్యూచర్ సిటీ వంటి ప్రాజెక్టుల పేరుతో వేల ఎకరాల భూములను స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. ఫార్మాసిటీ ప్రాజెక్టును రద్దు చేసి భూదందాలకు మార్గం సుగమం చేశారని ఆరోపించారు. కొంగరకలాన్ ప్రాంతంలోని భూముల విషయంలో కూడా భారీ అవకతవకలకు ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. ధరణి పోర్టల్‌లో భద్రతా వ్యవస్థలు కఠినంగా ఉండేవని, ఇప్పుడు భూభారతి వ్యవస్థలో పెద్ద ఎత్తున గోల్‌మాల్ జరుగుతోందని కేటీఆర్ విమర్శించారు. రాష్ట్రంలో కనీవినీ ఎరుగని రీతిలో భూదోపిడీ జరుగుతోందని ఆరోపిస్తూ, ఈ వ్యవహారాల కారణంగా సీఎం రేవంత్ రెడ్డి భవిష్యత్తులో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వ్యాఖ్యానించారు. మరో రెండేళ్లలో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తొలగించడం వెనుక భారీ భూ కుంభకోణం దాగి ఉందని కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. సీఎం కుటుంబానికి సంబంధించిన భూ అక్రమాల అంశాన్ని కొండా సురేఖ కుమార్తె ప్రస్తావించడంతోనే ఆమెను మంత్రి పదవి నుంచి తొలగించారని పేర్కొన్నారు. ఈ వ్యవహారం కాంగ్రెస్ ప్రభుత్వంలోని అంతర్గత విభేదాలను బయటపెడుతోందని అన్నారు. 22ఏ నిషేధిత భూముల జాబితా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భారీగా పెరిగిందని కేటీఆర్ ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో 16 లక్షల ఎకరాలుగా ఉన్న భూముల జాబితా ప్రస్తుతం కోటి 16 లక్షల ఎకరాలకు చేరిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో భూదందాలపై సమగ్ర విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## మమ్మల్ని ఇంటికి పంపించండి.. పాక్‌లో ఇద్దరు హిందూ మైనర్

# అక్కాచెల్లెళ్ల రోదన



**ఇంటర్నెట్ డెస్క్ (నవజ్యోతి):** పాకిస్థాన్‌లో మరో అమానుష ఘటన వెలుగుచూసింది. 13, 14 ఏళ్ల వయసున్న హిందూ మైనర్ అక్కాచెల్లెళ్లను బలవంతంగా మతం మార్చుకునేలా చేసి ఇద్దరు యువకులు పెళ్లి చేసుకున్నట్లుగా వచ్చిన ఆరోపణలు కలకలం రేపాయి. తమను తల్లిదండ్రుల వద్దకు పంపించాలని ఆ బాలికలు కోరగా.. న్యాయస్థానం నిరాకరించింది. దాంతో వారు కోర్టులో రోదించారు. సింధ్ ప్రావిన్స్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది.

**స్థానిక మీడియా కథనాల ప్రకారం..**

మైనార్టీ హక్కుల సంఘాల వివరాల ప్రకారం.. ఆ ఇద్దరు అక్కాచెల్లెళ్లు పాకిస్థాన్‌లో మైనార్టీ వర్గానికి చెందినవారు. వారిని అపహరించి, బలవంతంగా మతం మార్చి అహ్మద్ సోలంగి, మన్సూర్ సోలంగి అనే యువకులు వివాహం చేసుకున్నారు. 10 రోజుల వ్యవధిలో ఆరుగురు మైనర్ బాలికలను తండో అల్లహ్యార్ జిల్లా నుంచి అపహరించారని పాక్ పాత్రికేయుడు సోషల్ మీడియాలో ఓ వీడియోను పోస్టు చేశారు. 'గతంలోనూ ఈ జిల్లాలో బలవంతపు మత మార్పిళ్లపై పలు కథనాలు వచ్చాయి. ఈ అక్కాచెల్లెళ్ల వ్యవహారం న్యాయస్థానానికి చేరడంతో విచారణ జరిగింది. తమను ఇంటికి పంపించేయాలని వారు జడ్జి ఎదుట ఏడుస్తూ అభ్యర్థించారు. కానీ, వారిని సంరక్షణ గృహానికి తరలించాలని న్యాయస్థానం ఆదేశించింది' అని ఆ పాత్రికేయుడు పేర్కొన్నారు.

**పాతికేళ్లుగా రగులుతున్న సెగ!**

పాక్‌లో వందల సంఖ్యలో హిందూ మహిళలు అపహరణకు గురవుతున్నారని, వారిని మతం మార్చి, వివాహాలు చేస్తున్నారని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ పేర్కొంది. పాక్‌లో హిందువులపై వివక్ష కొనసాగుతోందని ఆందోళన వ్యక్తం చేసింది.

# మార్చి నాటికి బ్యారియర్లు లేని టోల్‌బూత్‌లు: గడ్కరీ



**ముంబయి (నవజ్యోతి ప్రతినిధి):** ఫాస్టాగ్ కారణంగా టోల్‌ప్లాజాల వద్ద వేచి చూసే సమయం గణనీయంగా తగ్గిందని, వచ్చే ఏడాది నుంచి అసలు ఆగే అవసరమే ఉండదంటున్నారు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ. 2027 మార్చి కల్లా బ్యారియర్లు లేని టోల్‌బూత్‌లు అందుబాటులోకి రానున్నాయని వెల్లడించారు. ఈ మేరకు ముబయిలో నిర్వహించిన గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2026లో ఆయన మాట్లాడారు. దీనివల్ల ప్రభుత్వ ఆదాయం కూడా పెరుగుతుందన్నారు. టోల్‌బూత్‌ల వద్ద ఒకప్పుడు సగటున 12 నిమిషాలు వేచి ఉండాల్సి వచ్చేదని గడ్కరీ అన్నారు. కొన్ని సందర్భాల్లో 30 నిమిషాలు కూడా పట్టేదన్నారు. ఫాస్టాగ్ కారణంగా ఈ సమయం 80-90 శాతం తగ్గిందని తెలిపారు. బ్యారియర్లు లేని టోల్‌బూత్‌ల వల్ల ఆ సమయం ఇంకా తగ్గుముఖం పడుతుందని మంత్రి వివరించారు. దీనివల్ల సమయం ఆదా కావడంతో పాటు ఏటా రూ.10వేల కోట్లు ఆదాయం అదనంగా ప్రభుత్వానికి సమకూరుతుందన్నారు. వార్షికంగా సుమారు రూ.5,250 కోట్ల మేర ఇంధనం కూడా ఆదా అవుతుందని చెప్పారు.

**ఎన్ఎస్ఈ ఐపీఓ తేదీలొచ్చాయ్.. ధరల శ్రేణి ఇలా..**

బ్యారియర్లు లేని టోల్‌బూత్‌లకు సంబంధించి పైలట్ ప్రాజెక్ట్ కొనసాగుతోందని గడ్కరీ తెలిపారు. ఈ ఏడాది డిసెంబర్ నాటికి 70 శాతం టోల్‌బూత్‌ల వద్ద అడ్డంకులు తొలగనున్నాయని తెలిపారు. వచ్చే ఏడాది మార్చికల్లా నూరు శాతం పూర్తవుతుందన్నారు. ప్రతిపాదిత విధానంలో మానవ ప్రమేయం లేకుండానే టోల్ వసూలు సాధ్యం కానుందని చెప్పారు. ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ సాంకేతికతను ఆధారిత ఎలక్ట్రానిక్ టోల్ కలెక్షన్‌తో అనుసంధానించడం ద్వారా టోల్ చెల్లించడానికి వాహనం ఆగకుండానే ఫీజు వసూలు పూర్తవుతుందని వివరించారు.

## సహజసిద్ధంగా పుట్టిన వినాయకుడు..

# ప్లాస్టర్‌లో ఎందుకు చిక్కుకున్నాడు?

### పార్వతి అమ్మవారు నలుగు పిండితో సృష్టించిన గణేశుడు.. నేడు పీవోపీ, రసాయన రంగుల్లో ఎందుకు బందీ అయ్యాడు?

**హైదరాబాద్, సెప్టెంబర్ 11 (నవజ్యోతి ఎడిటోరియల్):** వినాయక చవితి వస్తే భక్తి వెల్లువెత్తుతుంది. ఇళ్లలో పూజలు, వీధుల్లో మండపాలు, డప్పుల మోత, భజనలు, గణపతి నామస్మరణతో నగరాలు మార్మోగుతాయి. భక్తితో ప్రతిష్ఠించిన వినాయకుడిని కొన్ని రోజుల పాటు పూజించి, చివరకు అదే భక్తితో నిమజ్జనం చేస్తాం. నీటిలో విగ్రహం మునిగే సమయంలో వేలాది గొంతులు ఒకే నినాదంగా మారతాయి. అక్కడితో మన పండుగ ముగుస్తుంది. కానీ ప్రకృతికి అప్పుడే మరో అధ్యాయం మొదలవుతుంది.మనకు అది నిమజ్జనం. చెరువుకు అది ఏమిటి? నీటిలోకి దిగిన విగ్రహంతోపాటు ఏ పదార్థాలు చేరుతున్నాయి? అవి ఎంతకాలం అక్కడే ఉంటాయి? నీటిని నమ్ముకుని జీవించే జీవులపై వాటి ప్రభావం ఏమిటి? మనం దేవుడిని నీటికి అప్పగిస్తున్నామా.. లేక మనం తయారు చేసిన వ్యర్థాలను నీటిపై మోపుతున్నామా? ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా ప్రతిసారీ పండుగ ముగిసిందని అనుకోవడం సులభమే. కానీ బాధ్యతాయుతమైన సమాజం అలా చేయదు.

### నలుగు పిండితో పుట్టిన గణేశుడు

గణేశుని ఆవిర్భావానికి సంబంధించిన ప్రసిద్ధ పురాణ కథనం మనకు ఒక ప్రత్యేకమైన విషయాన్ని చెబుతుంది. పార్వతి అమ్మవారు తన శరీరానికి రాసుకున్న నలుగు పిండితో ఒక బాలుడి రూపాన్ని తయారు చేసి, ఆ రూపానికి ప్రాణం పోశారని కథనం. ఆ బాలుడే గణేశుడిగా ప్రసిద్ధి చెందాడు. గణేశుని ఆవిర్భావానికి సంబంధించిన పురాణాల్లో భిన్నమైన కథనాలు ఉన్నప్పటికీ, ఈ కథలో దైవ రూపం సహజంగా లభించే పదార్థంతో సృష్టించబడటం ఒక ముఖ్యమైన అంశం.నలుగు పిండి మట్టి కాదు. ఈ విషయాన్ని కలపకూడదు. కానీ సహజ పదార్థంతో దైవరూపాన్ని రూపొందించి ఆరాధించడం అనే భావన మన ఆధ్యాత్మిక సంప్రదాయానికి దూరమైనది కాదు. అందుకే నేటి మట్టి గణపతి ఆలోచనను కేవలం ఆధునిక పర్యావరణ నినాదంగా చూడటం కూడా పూర్తి చిత్రం కాదు. మనిషి ప్రకృతి నుంచి తీసుకున్నదాన్ని పవిత్ర రూపంగా మలిచి, ఆరాధించి, తిరిగి ప్రకృతికే అప్పగించే ఆలోచనలో ఒక గొప్ప జీవన తత్వం ఉంది.

### మరి మనం ఎటు వచ్చాం?

ఒకప్పుడు సహజ పదార్థాలతో దైవరూపాన్ని రూపొందించేవాళ్లం. ఇప్పుడు అదే దైవ రూపానికి ప్లాస్టర్ ఆఫ్ పారిస్, కృత్రిమ రంగులు, ప్లాస్టిక్, థర్మోకోల్ వంటి పదార్థాలను జోడిస్తున్నాం. విగ్రహం పెద్దదైతే ఉత్సవం గొప్పదన్న భావన పెరిగింది. అలంకరణ ఖరీదైనదైతే భక్తి ఎక్కువన్న అపోహ ఏర్పడింది. రంగులు ఎక్కువైతే వైభవం పెరిగినట్టు భావిస్తున్నాం.

### కానీ పండుగ వైభవాన్ని కొలవాల్సింది విగ్రహం ఎత్తుతోనా? లేక మనం ప్రకృతిపై వేసే భారంతోనా?

ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తేలికగా ఉంటుంది. సులభంగా ఆకారాలు ఇవ్వొచ్చు. భారీ విగ్రహాలు తయారు చేయడానికి అనుకూలంగా ఉంటుంది. అందుకే దాని వినియోగం పెరిగింది. కానీ నిమజ్జనం తర్వాత అది సహజ మట్టిలా త్వరగా ప్రకృతిలో కలిసిపోదు.



నీటి వనరుల్లో అవశేషాలు మిగిలే అవకాశం ఉంది. మనకు సౌకర్యంగా ఉన్న పదార్థం ప్రకృతికి కూడా సౌకర్యంగా ఉండదనే విషయాన్ని ఇక్కడ గుర్తించాలి.

### అందం కోసం రంగులు.. నీటికి భారమా?

విగ్రహానికి రంగులు వేయడం తప్పు కాదు. కానీ ఎలాంటి రంగులు ఉపయోగిస్తున్నామన్నదే ప్రశ్న. మెరిసే రంగులు మన కళ్లను ఆకట్టుకోవచ్చు. కానీ వాటిలో ఉండే పదార్థాలు నీటిలోకి చేరితే పరిణామం వేరుగా ఉంటుంది.కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి మార్గదర్శకాల్లో కొన్ని కృత్రిమ రంగుల్లో సీసం, కాడ్మియం, పాదరసం, ఆర్సెనిక్, క్రోమియం వంటి భార లోహాలు ఉండే అవకాశం ఉందని పేర్కొంది. నిమజ్జనం సమయంలో ఇవి నీటిలోకి చేరే అవకాశం ఉంది. ప్లాస్టిక్, థర్మోకోల్, ఇతర కృత్రిమ అలంకరణలు కూడా నీటిలో వ్యర్థాలుగా మిగిలిపోతాయి.అందుకే అసలు ప్రశ్న "విగ్రహాన్ని నిమజ్జనం చేయాలా వద్దా?" కాదు. "నిమజ్జనం చేసే విగ్రహం ఎలాంటి పదార్థంతో తయారై ఉండాలి?" అన్నదే.

### హుస్సేన్‌సాగర్ మనల్ని హెచ్చరిస్తోంది

మన నగరంలోనే దీనికి ఉదాహరణ ఉంది. హుస్సేన్‌సాగర్‌పై జరిగిన శాస్త్రీయ అధ్యయనాల్లో విగ్రహ నిమజ్జన ప్రాంతాలతో సహా సరస్సులోని నీటి నాణ్యత, భార లోహాల స్థాయిలను పరిశీలించారు. ఆర్సెనిక్, కాడ్మియం, క్రోమియం, నికెల్, సీసం, రాగి, ఇనుము, మాంగనీస్ వంటి మూలకాలను అధ్యయనాల్లో విశ్లేషించారు. నిమజ్జన కార్యకలాపాలతో నీటి వ్యవస్థలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని పరిశోధనలు సూచించాయి.ఇది భక్తిని తప్పుపట్టే వాదన కాదు. శాస్త్రం చెప్పే హెచ్చరిక. మన విశ్వాసాన్ని ఎవరూ తగ్గించమని చెప్పడం లేదు. కానీ మన విశ్వాసం వల్ల ప్రకృతికి నష్టం జరుగుతున్నప్పుడు దాన్ని గమనించకపోవడం కూడా సరైనది కాదు.

### చేపకు గణేశ్ చవితి తెలియదు

మన భక్తిని మనం అర్థం చేసుకుంటాం. మన సంప్రదాయాన్ని మనం గౌరవిస్తాం. కానీ చెరువులోని చేపకు మన పండుగ తెలియదు. నీటి నాణ్యతలో మార్పు మాత్రమే దానికి తెలుస్తుంది. నీరు దాని జీవితం.ఇదే మన ఆలోచనలో కనిపించని ఖాళీ. మన పండుగ మనకు కొన్ని రోజుల ఆనందం. కానీ నీటి వ్యవస్థలో పడే ప్రభావం అంతటితో ముగియకపోవచ్చు. మనం దేవుడికి సమర్పిస్తున్నామని భావించే వస్తువు.. మరో జీవికి సమస్యగా మారకూడదు.

### దేవుడిని పూజించడానికి ప్రకృతిని శిక్షించాల్సిన అవసరం ఏముంది?

### ప్రభుత్వం ప్రత్యామ్నాయం ఇస్తుంటే.. మనం ఇంకా ఎందుకు ఆలోచించాలి?

ఇక్కడ మరో ముఖ్యమైన విషయం ఉంది. మట్టి గణపతిని ఎంచుకోవడం ఇప్పుడు కేవలం వ్యక్తిగతంగా ఖర్చు పెట్టి చేయాల్సిన ప్రయత్నం కాదు. ప్రభుత్వం, స్థానిక సంస్థలు, పర్యావరణ విభాగాలు, స్వచ్ఛంద సంస్థలు, నివాస సంక్షేమ సంఘాలు ప్రజలకు ప్రత్యామ్నాయాన్ని అందిస్తున్నాయి.

హైదరాబాద్‌లో ప్రభుత్వ సంస్థల ఆధ్వర్యంలో ఉచితంగా మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేసే కార్యక్రమాలు జరుగుతున్నాయి. గతంలో హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల్లో ఉచిత మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. స్వచ్ఛంద సంస్థలు, నివాస సంక్షేమ సంఘాలు కూడా ఈ కార్యక్రమాల్లో భాగస్వాములయ్యాయి. ఈ ఏడాది హైదరాబాద్ పరిధిలోని మూడు మున్సిపల్ సంస్థలు కలిసి నాలుగు లక్షల మట్టి గణపతి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేసినట్లు సమాచారం.

**అంటే ప్రభుత్వం చెబుతోంది.. "ప్రత్యామ్నాయం ఉంది."**
**స్వచ్ఛంద సంస్థలు చెబుతున్నాయి.. "మార్పు సాధ్యమే."**
**పర్యావరణ సంస్థలు చెబుతున్నాయి.. "నీటిని కాపాడండి."**
**ఇక ప్రజలు చెప్పాల్సింది ఒక్కటే.. "మేమూ బాధ్యత తీసుకుంటాం."**

### భక్తిని తగ్గించాల్సిన అవసరం లేదు.. బాధ్యతను పెంచాలి

మట్టి గణపతిని ఎంచుకోవడం భక్తిని తగ్గించడం కాదు. అది భక్తికి మరో అర్థం ఇవ్వడం. భారీ విగ్రహం పెట్టకపోతే భక్తి తగ్గిపోదు. ఖరీదైన అలంకరణ లేకపోతే గణపతి మహిమ తగ్గదు. పండుగను ఘనంగా జరుపుకోవడానికి ప్రకృతిని భారంగా మార్చాల్సిన అవసరం లేదు.నిజానికి మనం కాపాడుకోవాల్సింది పండుగ రూపం కాదు.. పండుగ వెనుక ఉన్న విలువ. విఘ్నాలను తొలగించే గణపతిని పూజిస్తూ మనమే ప్రకృతికి కొత్త విఘ్నాలు సృష్టించడం ఎంతవరకు సమంజసం?

### ఈసారి నిర్ణయం మన ఇంటి నుంచే మొదలవ్వాలి

వినాయక విగ్రహం కొనేటప్పుడు ఒక్కసారి ఆగి ఆలోచిద్దాం. అది ఏ పదార్థంతో తయారైంది? పీవోపీనా, మట్టినా? దానికి ఎలాంటి రంగులు వేశారు? నిమజ్జనం తర్వాత అది నీటిలో ఏం మిగులుస్తుంది? ప్రభుత్వమే ఉచితంగా మట్టి గణపతిని అందిస్తున్నప్పుడు మనం దాన్ని ఎంచుకోలేనంత పెద్ద సమస్య ఏమిటి?

ఒక కుటుంబం మారితే పెద్ద మార్పు కనిపించకపోవచ్చు. కానీ లక్షల కుటుంబాలు ఒకే నిర్ణయం తీసుకుంటే పరిస్థితి మారుతుంది. పండుగను మార్చాల్సిన అవసరం లేదు. పండుగను చూసే మన దృష్టిని మార్చాలి.

### పండుగ ముగిసిన తర్వాత కూడా చెరువు అక్కడే ఉంటుంది

వినాయక చవితి ముగుస్తుంది. డప్పుల మోత ఆగిపోతుంది. మండపాలు తొలగిపోతాయి. భక్తులు ఇళ్లకు వెళ్లిపోతారు. కానీ చెరువు మాత్రం అక్కడే ఉంటుంది. నిమజ్జనం తర్వాత నీటిపై తేలే పూలు, ఒడ్డున కనిపించే విగ్రహాల అవశేషాలు, నీటి అడుగున మిగిలే పదార్థాలు ఆ పండుగకు మిగిలిన గుర్తులుగా ఉంటాయి.

**మన పండుగ ముగిసిన తర్వాత కూడా ప్రకృతి ఆ భారాన్ని మోస్తూనే ఉంటుంది.**
**అందుకే ఈసారి నిమజ్జనం ముందు ఒక ప్రశ్న అడగాలి.**
**"నేను గణపతిని నీటిలోకి పంపుతున్నానా.. లేక నా బాధ్యతను కూడా నీటిలోకి వదిలేస్తున్నానా?"**
**సహజసిద్ధంగా పుట్టిన వినాయకుడికి మనం ఇవ్వాల్సిన గౌరవం ఇదే**

వినాయకుడు విఘ్నాలను తొలగించే దేవుడు. మన సంప్రదాయం ప్రకృతిని పవిత్రంగా చూసింది. పార్వతి అమ్మవారు నలుగు పిండితో గణేశుని సృష్టించిన పురాణ కథనం సహజ పదార్థంతో దైవరూపం సృష్టించే ఒక ఆధ్యాత్మిక భావనను మన ముందుంచుతుంది. ఈ నేపథ్యంలో ప్రకృతికి హాని కలగకుండా గణపతిని ఆరాధించాలనే ఆలోచన మన భక్తికి విరుద్ధం కాదు.

### అది భక్తికి అడ్డంకి కాదు.. భక్తికి బాధ్యత

దేవుడిని ప్రేమిస్తే ఆయన సృష్టించిన ప్రకృతిని కూడా ప్రేమించాలి. నీటిని పవిత్రంగా భావిస్తే దాన్ని వ్యర్థాలతో నింపకూడదు. ప్రకృతిని తల్లిగా పిలిస్తే పండుగ పేరుతో ఆమెపై భారాన్ని మోపకూడదు.మనం గణపతిని మట్టితో తయారు చేయవచ్చు. సహజ రంగులతో అలంకరించవచ్చు. పర్యావరణహితంగా పూజించవచ్చు. ప్రభుత్వమే ప్రత్యామ్నాయం అందిస్తున్నప్పుడు దాన్ని స్వీకరించవచ్చు. స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణ కార్యకర్తలు చేస్తున్న ప్రయత్నాలకు మన వంతు చేయూత ఇవ్వవచ్చు.ఎందుకంటే చివరికి మనం కాపాడేది కేవలం ఒక చెరువును కాదు.

మన పిల్లలకు మిగిల్చే నీటిని, మన నగరానికి మిగిల్చే ప్రకృతిని, మన సంప్రదాయానికి మిగిల్చే విలువను.వినాయకుడిని పూజించడం అంటే విఘ్నాలను తొలగించమని కోరడం. ఈసారి మనమే ఒక విఘ్నాన్ని తొలగిద్దాం — భక్తికి, ప్రకృతికి మధ్య ఉన్న దూరాన్ని.



సహజసిద్ధంగా పుట్టిన వినాయకుడిని.. కృత్రిమ పదార్థాల్లో బంధించాల్సిన అవసరం లేదు.
భక్తి మన చేతులను జోడిస్తే.. బాధ్యత మన చేతులను కదిలించాలి.
ఈసారి గణపతి నిమజ్జనంతో ఒక పండుగ ముగియాలి.. కానీ ప్రకృతిపై మన బాధ్యత మాత్రం మొదలవ్వాలి.

సాయి మణికంఠ చికోటి
మేనేజింగ్ ఎడిటర్
నవజ్యోతి తెలుగు డైలీ

---

## కేజేఎల్ పౌల్ట్రీ గేటు ఎదుట కార్మికుల నిరసన

**సకాలంలో జీతాలు ఇవ్వాలి.. చట్టబద్ధ హక్కులు కల్పించాలి**



బిక్కనూరు, సెప్టెంబర్ 11 (నవజ్యోతి ప్రతినిధి): మండల పరిధిలోని కేజేఎల్ పౌల్ట్రీ సంస్థ ప్రధాన గేటు ఎదుట కార్మికులు శుక్రవారం బైఠాయించి నిరసన చేపట్టారు. గత రెండేళ్లుగా సకాలంలో వేతనాలు చెల్లించడం లేదని, కార్మిక చట్టాల ప్రకారం తమకు దక్కాల్సిన గుర్తింపు కార్డులు, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించడం లేదని ఆరోపించారు. ప్రతి నెల 10వ తేదీలోపు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ 'జీతాలు కావాలి.. కావాలి', 'నెలనెలా జీతాలు కావాలి' అంటూ నినాదాలు చేశారు. బకాయి వేతనాలు చెల్లించి, చట్టబద్ధ హక్కులు, సౌకర్యాలు కల్పించే వరకు విధుల్లోకి వెళ్లబోమని స్పష్టం చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## ఉపాధ్యాయులకు ఘన సన్మానం

**23 మంది ఉపాధ్యాయులకు సత్కారం**



బిక్కనూరు, సెప్టెంబర్ 11 (నవజ్యోతి ప్రతినిధి): ఇటీవల జరిగిన ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని బిక్కనూరు రైతు భవన్‌లో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న 23 మంది ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి హాజరయ్యారు. బిక్కనూరు గ్రామ సర్పంచ్ బల్యాల రేఖ సుదర్శన్, తహసీల్దార్, ఎంపీడీవో, మండల అధ్యక్షుడు అనిల్ కుమార్, కార్యదర్శి శ్రీపాల్ రెడ్డి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ప్రసూన దేవి, వెంకటేశ్వర్లు, మధుసూదన్ రెడ్డి, నరేందర్, స్వామికుమార్ తదితరులు పాల్గొన్నారు.

---

## వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లే టార్గెట్.. రాగి తీగల ముఠా అరెస్ట్

**29 ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం.. మెదక్‌లో మరో 23 చోరీలు ముగ్గురు నిందితుల అరెస్ట్.. మరో వ్యక్తి పరారీ**






కామారెడ్డి, సెప్టెంబర్ 11 (నవజ్యోతి ప్రతినిధి): కామారెడ్డి, మెదక్ జిల్లాల్లో వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి రాగి తీగలను చోరీ చేస్తున్న ముఠాను పోలీసులు ఎట్టకేలకు పట్టుకున్నారు. గత ఫిబ్రవరి నుంచి కామారెడ్డి జిల్లాలో 29, మెదక్ జిల్లాలో 23 ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి రాగిని ఎత్తుకెళ్లినట్లు కామారెడ్డి జిల్లా ఎస్పీ రాజేశ్ చంద్ర తెలిపారు.విద్యుత్ శాఖ నుంచి ట్రాన్స్‌ఫార్మర్లు నిలిచిపోయిన సమయాలకు సంబంధించిన సాంకేతిక సమాచారాన్ని సేకరించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ నెల 9న నిందితులను పట్టుకునేందుకు ప్రయత్నించగా వారు పోలీసులు, విద్యుత్ సిబ్బందిపై దాడి చేసి పరారయ్యారని, దీనిపై ప్రత్యేక కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గురువారం రాత్రి భిక్కనూర్ పరిధిలో నేరానికి యత్నిస్తున్న సమయంలో పక్కా వ్యూహంతో వారిని పట్టుకున్నట్లు వెల్లడించారు.

**— ఒకే కుటుంబానికి చెందిన అన్నదమ్ములు**

ముఠాలో మొత్తం నలుగురు సభ్యులు ఉండగా, వారంతా ఒకే కుటుంబానికి చెందిన అన్నదమ్ములని ఎస్పీ తెలిపారు. వీరు ఇతర రాష్ట్రానికి చెందినవారని చెప్పారు. పట్టుబడిన నిందితులను బల్బీర్ సింగ్, రూప్ సింగ్, రతన్‌చంద్గా గుర్తించామని, మరో వ్యక్తి పరారీలో ఉన్నాడన్నారు. వీరిపై భోపాల్, నార్సింగి తదితర ప్రాంతాల్లో దోపిడీలు, ఇళ్ల దొంగతనాలు, ట్రాన్స్‌ఫార్మర్ చోరీ కేసులు ఉన్నట్లు తెలిపారు. ఒకరిపై గతంలో పీడీ చట్టం కింద కేసు నమోదై ఏడాది జైలు శిక్ష అనుభవించినట్లు వెల్లడించారు.

**— పగలు రెక్కీ.. రాత్రి చోరీ**

విలాసవంతమైన జీవితం, సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో నిందితులు ఈ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు విచారణలో తేలిందని ఎస్పీ చెప్పారు. హైదరాబాద్ పరిసరాలు, శివారు ప్రాంతాల్లో పగటిపూట రెక్కీ నిర్వహించి, రాత్రి విద్యుత్ సరఫరా నిలిచిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి రాగి తీగలను చోరీ చేసేవారని తెలిపారు.

**— పనిముట్లు, వాహనం స్వాధీనం**

నిందితుల నుంచి ద్విచక్ర వాహనం, మొబైల్‌ఫోన్, రంపపు బ్లేడ్లు, కటింగ్ ప్లేయర్లు, కట్టర్లు, సుత్తులు, ఇనుప రాడ్లు, చోరీ చేసిన రాగి తీగలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. చోరీ చేసిన రాగిని హైదరాబాద్‌లోని కొనుగోలుదారులకు విక్రయిస్తున్నట్లు గుర్తించామని చెప్పారు. ముగ్గురు కొనుగోలుదారులతో పాటు మధ్యవర్తిని కూడా గుర్తించామని, వారిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయని వెల్లడించారు.

### అర్ధరాత్రి ట్రాన్స్‌ఫార్మర్ ట్రిప్ అయితే సమాచారం ఇవ్వాలి

**ట్రాన్స్‌ఫార్మర్లకు దొంగతన నిరోధక బోల్టులు ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఎస్పీ కోరారు. గ్రామాల్లో అర్ధరాత్రి సమయంలో ట్రాన్స్‌ఫార్మర్ ఉన్నట్టుండి నిలిచిపోతే వెంటనే పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 112కు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. సకాలంలో సమాచారం అందితే నిందితులను అక్కడికక్కడే పట్టుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.కేసును ఛేదించిన డీఎస్పీ, భిక్కనూర్ సీఐ, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్, ఎస్సై, భిక్కనూర్ ఎస్‌హెచ్ఓతో పాటు ఇతర పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు. నిందితులను పట్టుకునే క్రమంలో గాయపడినా పోలీసులకు సహకరించిన విద్యుత్ శాఖ సిబ్బందిని కూడా ప్రశంసించి ప్రశంసాపత్రాలు, రివార్డులు అందజేశారు.**

## అంతంపల్లిలో కాంగ్రెస్ నూతన కార్యవర్గం



అంతంపల్లి, సెప్టెంబర్ 11 (నవజ్యోతి ప్రతినిధి): భిక్కనూరు మండలం అంతంపల్లి గ్రామ కాంగ్రెస్ కమిటీ నూతన కార్యవర్గం ఏర్పడింది. సీనియర్ కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడిగా పిట్ల గోపాలస్వామి, ఉపాధ్యక్షుడిగా జీడి నరసింహులు, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా భాను తేజ, ఉపాధ్యక్షుడిగా అరవింద్ ఎన్నికయ్యారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీరామ్ వెంకటేష్ ఆధ్వర్యంలో ఎన్నిక జరిగింది. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సుధాకర్ రెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు జీవన్, మాజీ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు నాగరాజు, సీనియర్ నాయకులు జీడి భూపాల్, గంగారెడ్డి, సంజీవరెడ్డి, వీరోబా, యువజన కాంగ్రెస్ సామాజిక మాధ్యమాల ఇన్‌చార్జ్ సోహెల్‌తో పాటు కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆశయాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నూతన కార్యవర్గం కృషి చేయాలని కోరారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ అడగడమే నేరమా?

**కమ్మెట చెన్నారెడ్డిని వరుసగా రెండో రోజు అరెస్ట్**



రామచంద్రపురం, సెప్టెంబర్ 09 (నవజ్యోతి ప్రతినిధి): విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చిన శాంతియుత ర్యాలీకి హాజరు కావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చిన నేపథ్యంలో బీఆర్‌ఎస్వీ పటాన్‌చెరు నియోజకవర్గ అధ్యక్షుడు కమ్మెట చెన్నారెడ్డిని కొల్లూరు పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. బషీర్‌బాగ్ చౌరస్తాలో శుక్రవారం ఉదయం 10 గంటలకు ర్యాలీ జరగనున్న నేపథ్యంలో ఆయనను నివాసంలోనే అదుపులోకి తీసుకున్నారు. వరుసగా రెండో రోజు తనను అరెస్ట్ చేయడంపై చెన్నారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేయడం, విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు శాంతియుత ర్యాలీకి పిలుపునివ్వడం నేరమా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా విద్యార్థుల సమస్యలపై తమ ఉద్యమం ఆగదని స్పష్టం చేశారు.

## తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

**కలెక్టరేట్‌కు బీజేపీ నాయకుల వినతి**



కామారెడ్డి, సెప్టెంబర్ 11 (నవజ్యోతి ప్రతినిధి): తెలంగాణ విమోచన దినోత్సవాన్ని సెప్టెంబర్ 17న రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు కామారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో ఏవోకు పార్టీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్న రాజులు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా నిజాం నిరంకుశ పాలనలో తెలంగాణ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. మాజీ ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ చేపట్టిన సైనిక చర్యతో 1948 సెప్టెంబర్ 17న నిజాం పాలన నుంచి తెలంగాణకు విమోచనం లభించిందని పేర్కొన్నారు. నాటి నిజాం, రజాకార్ల ఆకృత్యాల్లో ఎంతోమంది ధన, మాన, ప్రాణ నష్టాలకు గురయ్యారని తెలిపారు. ఆ చారిత్రక ఘటనలు, నాటి గాయాల గుర్తులు భవిష్యత్ తరాలకు తెలిసేలా ప్రభుత్వం విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు చరిత్రను ప్రజలకు తెలియకుండా చేస్తున్నాయని ఆయన ఆరోపించారు.

## నారాయణపురంలో విస్తృతంగా పారిశుధ్య పనులు

**దోమల నివారణ.. ప్రజా ఆరోగ్యమే లక్ష్యం**



నడిగూడెం, సెప్టెంబర్ 11 (నవజ్యోతి ప్రతినిధి షేక్ నజీరుద్దీన్): వర్షాకాలం నేపథ్యంలో అంటువ్యాధులు ప్రబలకుండా నారాయణపురం గ్రామంలో విస్తృతంగా పారిశుధ్య పనులు చేపట్టారు. సర్పంచ్ అట్టూరి పుష్పావతి నాగేందర్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలోని అన్ని వీధుల్లో డోజర్ సహాయంతో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రం చేయించారు. మురుగు నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమల వ్యాప్తిని అరికట్టేందుకు బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల బారినపడకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చని, ప్రజలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రత్యూష, హెల్త్ అసిస్టెంట్ రమేష్, ఆశా కార్యకర్త శశిరేఖ, ఫీల్డ్ అసిస్టెంట్ సీతారాం రెడ్డి, పంచాయతీ సిబ్బంది అల్ వీరస్వామి, అల్లి అంజయ్య, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ప్రతి కులానికి ప్రత్యేక సంకేత సంఖ్య కేటాయించాలి

**బీసీల ధర్మ పోరాట దీక్షలో నాయకుల డిమాండ్**

కామారెడ్డి, సెప్టెంబర్ 11 (నవజ్యోతి ప్రతినిధి): జాతీయ జనగణనలో కులగణనను తప్పనిసరిగా చేపట్టి ప్రతి కులానికి ప్రత్యేక సంకేత సంఖ్య కేటాయించాలని బీసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద మహాత్మా జ్యోతిబాపూలే ప్రాంగణంలో బీసీ సంఘాల ఆధ్వర్యంలో ధర్మ పోరాట దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నీల నాగరాజు, సంక్షేమ సంఘం అధ్యక్షుడు సాప శివరాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి కుంబాల లక్ష్మణ్ యాదవ్ మాట్లాడుతూ జనగణనలో ప్రతి కులాన్ని పారదర్శకంగా, శాస్త్రీయ పద్ధతిలో నమోదు చేయాలని కోరారు. బీసీ కుటుంబాలను, బీసీ కాలమ్‌ను విస్మరించి కులగణన చేపట్టడం సరికాదన్నారు. రిజర్వేషన్లపై వ్యతిరేక ప్రచారం చేస్తున్న వారు ముందుగా ఆర్థికంగా వెనుకబడిన వర్గాల రిజర్వేషన్లపై తమ వైఖరిని స్పష్టం చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి జనగణనలో కులగణనను చేర్చాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. దీక్షకు మద్దతుగా మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ హాజరై బీసీ సంఘాల నాయకులకు



సంఘీభావం తెలిపారు. బీసీలకు తమ ప్రభుత్వం, తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని పేర్కొని నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కాసర్ల గోదావరి స్వామి, కోఆప్షన్ సభ్యుడు కుంబాల రవి, కౌన్సిలర్లు, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## నిమజ్జన మార్గాలపై ప్రత్యేక దృష్టి

**చివరి దశ పనులు వేగవంతం.. 13లోపు పూర్తి చేయాలని ఆదేశాలు**



కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 11 (నవజ్యోతి ప్రతినిధి): వినాయక నిమజ్జనానికి భారీగా భక్తులు, విగ్రహాలు తరలిరానున్న నేపథ్యంలో నిమజ్జన మార్గాల్లో మౌలిక వసతుల ఏర్పాట్లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి అసెంబ్లీ కన్వీనర్ ఆకుల సతీష్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు నిజాంపేట్, దుండిగల్, కొంపల్లి, చింతల్, గాజులరామారం, జీడిమెట్ల సర్కిళ్ల పరిధిలోని నిమజ్జన ప్రదేశాలను పరిశీలించారు. అనంతరం జోనల్ కమిషనర్ పింకీష్ కుమార్ ఆధ్వర్యంలో సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే 70 శాతానికి పైగా పనులు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. రహదారుల మరమ్మతులు, పారిశుద్ధ్య చర్యలు, వీధి దీపాల ఏర్పాటు, చెట్ల కొమ్మల తొలగింపు తదితర పనులు ఇందులో ఉన్నాయి. మిగిలిన పనులను సెప్టెంబర్ 13లోపు పూర్తి చేయాలని సూచించారు. నిమజ్జన సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పెండింగ్ పనుల్లో జాప్యం చేయకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జోనల్ కమిషనర్ ఆదేశించారు. కార్యక్రమంలో అసెంబ్లీ కో–కన్వీనర్ నల్ల జైశంకర్ గౌడ్, డివిజన్ కన్వీనర్లు మాధవులు, శంకర్ గౌడ్, నరసింహ, ఎల్లస్వామి, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడల్లో రాణిస్తేనే ప్రత్యేక గుర్తింపు

**మండల స్థాయి పోటీల్లో గురుకుల విద్యార్థినుల ప్రతిభ.. జిల్లా స్థాయికి ఎంపిక**





నడిగూడెం, సెప్టెంబర్ 11 (నవజ్యోతి ప్రతినిధి షేక్ నజీరుద్దీన్): క్రీడల్లో రాణించినప్పుడే సమాజంలో ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ చింతలపాటి వాణి అన్నారు. ఇటీవల నిర్వహించిన మండల స్థాయి పాఠశాల క్రీడా పోటీల్లో గురుకుల పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాల ఆవరణలో విజేతలను ప్రిన్సిపాల్ సన్మానించి పతకాలు అందజేశారు. కబడ్డీ, ఖో–ఖో, వాలీబాల్ పోటీల్లో విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. ఖో–ఖో, వాలీబాల్‌లో ప్రథమ బహుమతులు, కబడ్డీలో ద్వితీయ బహుమతి సాధించి జిల్లా స్థాయికి అర్హత సాధించారు. గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ నైపుణ్యాలను మెరుగుపరుచుకుని రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని వాణి ఆకాంక్షించారు. విద్యార్థినులను క్రీడల్లో తీర్చిదిద్దిన ఫిజికల్ డైరెక్టర్ సుశీలను పాఠశాల యాజమాన్యం అభినందించింది. కార్యక్రమంలో సీనియర్ వైస్ ప్రిన్సిపాల్ విజయ శ్రీ, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ సునీత, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

**పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాల వినియోగం**



కామారెడ్డి, సెప్టెంబర్ 11 (నవజ్యోతి ప్రతినిధి): వినాయక చవితి పండుగను పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణలో భాగంగా మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ మున్సిపల్ కార్యాలయంలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మట్టి విగ్రహాలను వినియోగించడం ద్వారా పర్యావరణానికి మేలు జరుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ పర్యావరణహిత మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించి వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని కోరారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, మట్టి విగ్రహాల వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కాసార్ల గోదావరి, కౌన్సిలర్ అంజాద్, కమిషనర్ పర్వతాలు, డీఈ హన్మంత్‌రావు, ఆర్ఓ గోపాల్‌రెడ్డి, టీపీఓ దేవరాజు, ఎస్ఐ ప్రశాంత్, భాగ్యలక్ష్మి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వల్లాపురంలో అభివృద్ధి పనులపై సమీక్ష

**నీటి సంరక్షణ, వ్యవసాయం, మౌలిక వసతులకు ప్రాధాన్యం**



నడిగూడెం, సెప్టెంబర్ 11 (నవజ్యోతి ప్రతినిధి షేక్ నజీరుద్దీన్): మండల పరిధిలోని వల్లాపురం గ్రామంలో వివిజి రాంజీ పథకం కింద చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఏపీవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించి సమీక్షించారు. గ్రామ ప్రజల అవసరాలు, క్షేత్రస్థాయి పరిస్థితులపై చర్చించి నీటి సంరక్షణ, వ్యవసాయాభివృద్ధి, పశుపోషణ, గ్రామీణ మౌలిక వసతులకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. ఇంకుడు గుంతలు, పంట కుంటలు, సామాజిక ఇంకుడు గుంతలు, పశువుల కొట్టాలు, సాగునీటి కాల్వల మరమ్మతులు, మరుగుదొడ్ల నిర్మాణం వంటి పనులను గుర్తించి, అత్యవసర పనులను ప్రాధాన్యత క్రమంలో ఎంపిక చేసి గ్రామసభలో ఆమోదించాలని తీర్మానించారు. సర్పంచ్ కేసగాని సరితాలక్ష్మణ్ మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా గుర్తించిన పనులను అధికారుల సమన్వయంతో వేగంగా పూర్తి చేస్తామని తెలిపారు. గ్రామంలో స్వచ్ఛమైన తాగునీటి సరఫరాపై ప్రత్యేక పర్యవేక్షణ చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రణబోతు మల్లారెడ్డి, ఉపసర్పంచ్ కోట చంద్రశేఖర్ రెడ్డి, వార్డు సభ్యులు, ఫీల్డ్ అసిస్టెంట్ తంగెళ్ల నాగరాజు, పథకం కార్మికులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కూలీలకు ఉపాధి కల్పించడమే ధ్యేయం

**ఉపాధి హామీ పనులను తక్షణమే మంజూరు చేయాలి**



నడిగూడెం, సెప్టెంబర్ 11 (నవజ్యోతి ప్రతినిధి షేక్ నజీరుద్దీన్): ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు 125 రోజుల పని కల్పించేలా గ్రామసభలో గుర్తించిన పనులను తక్షణమే మంజూరు చేయాలని నడిగూడెం సర్పంచ్ దున్నా శ్రీనివాస్ అధికారులను కోరారు. శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉపాధి హామీ పనుల గుర్తింపుపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామీణ కూలీలు ఇబ్బందులు పడకుండా ఉపాధి హామీ పనులు నిరంతరం కొనసాగేలా పక్కా ప్రణాళిక రూపొందించాలని కోరారు. అన్ని రంగాల్లో గ్రామాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసుకునేందుకు ప్రజలందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యలక ఉమారాణి, మాజీ సర్పంచ్ చెల్లంచర్ల సత్యనారాయణ, ఫీల్డ్ అసిస్టెంట్ పద్మ, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది, గ్రామ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్‌కు చెక్.. పర్యావరణ పరిరక్షణకు విద్యార్థుల ప్రతిజ్ఞ

**200 పర్యావరణహిత విగ్రహాలు.. 300 చేతి సంచుల పంపిణీ**



కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 10 (నవజ్యోతి ప్రతినిధి): పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో అవగాహన పెంచేందుకు సూరారం కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పర్యావరణ ప్రేమికుడు కోల రవీందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు 200 పర్యావరణహిత విగ్రహాలు, 300 చేతి సంచులు పంపిణీ చేశారు. ప్లాస్టిక్ కవర్ల వినియోగంతో పర్యావరణానికి కలిగే నష్టాలను విద్యార్థులకు వివరించి, ఇకపై ప్లాస్టిక్ కవర్లను వినియోగించకుండా చేతి సంచులనే ఉపయోగిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కూరగాయలు, పండ్లు కొనుగోలు చేసే సమయంలో తల్లిదండ్రులు కూడా చేతి సంచులు ఉపయోగించేలా అవగాహన కల్పిస్తామని విద్యార్థులు సంకల్పించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పుణ్యవతి, మల్లికార్జున్‌తో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వెల్దుర్తి మండల ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

**ఉపాధ్యాయులే సమాజ నిర్మాణానికి కీలకం: ఎంఈఓ బుచ్య నాయక్**




వెల్దుర్తి, సెప్టెంబర్ 11 (నవజ్యోతి ప్రతినిధి ముకుంద్): వెల్దుర్తి మండల కేంద్రంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మండల విద్యాధికారి బుచ్య నాయక్ ఉత్తమ ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, ఉపాధ్యాయుడు మారితే విద్యార్థి, విద్యార్థి మారితే కుటుంబం, కుటుంబం మారితే సమాజం మారుతుందని అన్నారు. రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న బి.సాంబయ్యను ప్రత్యేకంగా సన్మానించారు. జిల్లా స్థాయిలో నర్తన, శ్రీనివాస్, నవనీత ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక కాగా, మండల స్థాయిలో సృజన, శ్రీనివాస్, రాములు, చంద్రం, నరసింహారెడ్డి, రజిత, శ్రవణ్‌కుమార్, లావణ్య, భవాని, సురేష్‌కుమార్, వెంకటేశం, ఆగమయ్య, సంతోష్‌కుమార్, సోనీ తదితరులు ఎంపికయ్యారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈఓ యాదగిరి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొని అవార్డు గ్రహీతలను అభినందించారు.

## లంబాడి నాయకుల ముందస్తు అరెస్టు

**చలో అసెంబ్లీ కార్యక్రమం నేపథ్యంలో పోలీసుల చర్య**




తూప్రాన్, సెప్టెంబర్ 11 (నవజ్యోతి ప్రతినిధి నవీన్): చలో అసెంబ్లీ కార్యక్రమం నేపథ్యంలో లంబాడి నాయకులను తూప్రాన్ పోలీసులు శుక్రవారం ఉదయం ముందస్తుగా అరెస్టు చేశారు. లంబాడీల హక్కుల కోసం గిరిజన విద్యార్థి సంఘం పిలుపు మేరకు హైదరాబాద్‌లో చలో అసెంబ్లీ కార్యక్రమం నిర్వహించనున్న నేపథ్యంలో మెదక్ జిల్లా లంబాడి ఐక్యవేదిక అధ్యక్షుడు, తూప్రాన్ మున్సిపల్ నాలుగో వార్డు కౌన్సిలర్ రాథోడ్ జైపాల్ నాయక్, దిగావత్ శివ నాయక్ తదితరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ మందిరాన్ని అడవిలో కాకుండా హైదరాబాద్‌లో నిర్మించాలని, ఎస్టీ ఉప ప్రణాళిక నిధులు విడుదల చేయాలని, విద్యార్థుల ఉపకార వేతనాలపై అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్లతో ఈ కార్యక్రమానికి పిలుపునిచ్చినట్లు నాయకులు తెలిపారు.

## వెల్దుర్తి–మెదక్ డబుల్ రోడ్డుకు వినతిపత్రం

**ఎంపీ రఘునందన్‌రావుకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేష్‌గౌడ్ వినతి**



నర్సాపూర్, సెప్టెంబర్ 11 (నవజ్యోతి ప్రతినిధి ముకుంద్): వెల్దుర్తి నుంచి మెదక్ వరకు ఉన్న సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరించి మంజూరు చేయాలని కోరుతూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేష్‌గౌడ్ మెదక్ ఎంపీ రఘునందన్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగిల్ రోడ్డు కారణంగా నిత్యం ట్రాఫిక్ సమస్యలు, ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. కలెక్టరేట్‌తో పాటు మెదక్ పట్టణానికి నిత్యం పెద్ద సంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగిస్తున్నందున రహదారి విస్తరణ అత్యవసరమని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి సమస్యను తీసుకెళ్లి వెల్దుర్తి–మెదక్ డబుల్ రోడ్డుకు మంజూరు చేయించాలని ఎంపీని కోరారు. దీనిపై రఘునందన్‌రావు సానుకూలంగా స్పందించి కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి రోడ్డు మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు మల్లేష్‌గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాపగారి రమేష్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సంఘసాని సురేష్, జిల్లా కార్యదర్శి ఆంజనేయులు గౌడ్, మండల అధ్యక్షుడు రవి, కౌన్సిల్ సభ్యుడు కొండలరావు, అల్లిపూర్ సర్పంచ్ కుమార్, ఓబీసీ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ కోతలు ఆపాలి.. రైతులను ఆదుకోవాలి

**రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలి: బీజేపీ**





వేములపల్లి, సెప్టెంబర్ 11 (నవజ్యోతి ప్రతినిధి): రైతులకు 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ మండల నాయకులు విద్యుత్ సహాయ ఇంజినీర్‌కు వినతిపత్రం అందజేశారు. రైతుల విద్యుత్ కేబుల్ వైర్ల దొంగతనాలను అరికట్టేందుకు నిఘా పెంచాలని కోరుతూ ఎస్ఐ వెంకటేశ్వర్లుకు మరో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు పెదమం భరత్ మాట్లాడుతూ విద్యుత్ కోతలతో పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతులకు 24 గంటల విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు.రైతుల సమస్యలను పరిష్కరించకపోతే వారి పక్షాన బీజేపీ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో చిర్రా సామామూర్తి, చల్లమల్ల సీతారాంరెడ్డి, సత్యనారాయణ, పందిరి భాగ్యమ్మ, బుల్లెద్దు లవయ్య, నిమ్మల జాన్‌రెడ్డి, పెదమం ప్రసాద్, పగిడిపల్లి సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

# సమగ్ర వ్యవసాయంతోనే నిరంతర ఆదాయం

**మహిళా రైతులకు అవగాహన, శిక్షణ సదస్సు**

నడిగూడెం, సెప్టెంబర్ 11 (నవజ్యోతి ప్రతినిధి షేక్ నజీరుద్దీన్): మండల పరిధిలోని సిరిపురం గ్రామంలో ఆత్మ పథకం ఆధ్వర్యంలో సిరిపురం, నారాయణపురం గ్రామాల మహిళా రైతులకు సమగ్ర వ్యవసాయం, ప్రకృతి వ్యవసాయం, మహిళల పాత్ర, ఆరోగ్యం, పోషకాహారంపై అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సిరిపురంలోని సమగ్ర వ్యవసాయ క్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో పంటల సాగుతో పాటు పశుపోషణ, కూరగాయల సాగు, ఇంటి తోటలు, ప్రకృతి వ్యవసాయాన్ని సమన్వయం చేసుకోవడం ద్వారా ఏడాది పొడవునా ఆదాయం పొందవచ్చని వివరించారు. తక్కువ ఖర్చుతో ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఉత్పత్తి చేసుకోవడంలో ప్రకృతి వ్యవసాయం, ఇంటి తోటల ప్రాధాన్యతను వివరించారు. సిరి ఫౌండేషన్ సామాజిక కార్యకర్త గోపి మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో కూరగాయలు, ఆకుకూరలు, ఔషధ మొక్కలు సాగు చేసుకోవడం ద్వారా తాజా, పోషకాహారం అందుబాటులో ఉంటుందని తెలిపారు. సమగ్ర వ్యవసాయ క్షేత్రం నిర్వాహకుడు వాసికర్ల శేష్‌కుమార్ (బాబు) మాట్లాడుతూ సమగ్ర వ్యవసాయ విధానంతో వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాల ద్వారా నిరంతర ఆదాయం పొందవచ్చని, రసాయనాల వినియోగాన్ని తగ్గించి ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఉత్పత్తి చేయవచ్చని సూచించారు.



కార్యక్రమంలో ఆత్మ డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్ నివేదిత, కోదాడ సహాయ వ్యవసాయ సంచాలకులు స్రవంతి, నడిగూడెం వ్యవసాయ అధికారి జి.మల్సూర్, వ్యవసాయ విస్తరణ అధికారులు రేణుక, ఉమేష్, వెంకట్‌రెడ్డి, ఉపేందర్, మహిళా రైతులు పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేయొద్దు

**విద్యార్థుల భవిష్యత్తు కోసం జీవో 97ను రద్దు చేయాలి: పోగుల సైదులు గౌడ్**



మిర్యాలగూడ, సెప్టెంబర్ 11 (నవజ్యోతి ప్రతినిధి): జీవో 97 వల్ల పాలిటెక్నిక్ విద్యార్థులు, అధ్యాపకులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు పోగుల సైదులు గౌడ్ అన్నారు. జీవో 97ను వెంటనే రద్దు చేసి గతంలో కొనసాగిన విధానంలోనే పాలిటెక్నిక్ విద్యను కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఉత్తర్వులను రద్దు చేయాలని విద్యార్థులు కొంతకాలంగా ధర్నాలు, నిరసనలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. 'యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ'ను బలోపేతం చేయాలనే పేరుతో పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేయడం సరికాదన్నారు. పాలిటెక్నిక్ విద్య ద్వారా ఎంతోమంది విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలు పొంది ఉపాధి అవకాశాలు పొందుతున్నారని తెలిపారు. వందలాది మంది సిబ్బంది ఉండాల్సిన నైపుణ్య విశ్వవిద్యాలయంలో ప్రస్తుతం కేవలం ఐదుగురు మాత్రమే ఉన్నారని పేర్కొంటూ, ఇలాంటి పరిస్థితుల్లో పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతవరకు న్యాయం జరుగుతుందని ప్రశ్నించారు. విద్యార్థులు, అధ్యాపకుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే జీవో 97ను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి కర్నాటి శివరామకృష్ణ, మిర్యాలగూడ నియోజకవర్గ అధ్యక్షుడు వడ్డబోయిన సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణహిత వినాయక విగ్రహాల పంపిణీ

**మట్టి విగ్రహాలతో పర్యావరణాన్ని కాపాడాలి: జోనల్ కమిషనర్ చంద్రకళ**



రాజేంద్రనగర్, సెప్టెంబర్ 11 (నవజ్యోతి ప్రతినిధి): వినాయక చవితిని పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహించేలా శంషాబాద్ జోన్‌లో పర్యావరణహిత వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. జోనల్ కమిషనర్ కె.చంద్రకళ, సర్కిల్–18 డిప్యూటీ కమిషనర్ బి.సుమన్‌రావు సమక్షంలో గ్రీన్ ఎర్త్ ఇంటిగ్రేటెడ్ ఫెసిలిటీ ఆధ్వర్యంలో సంస్థ ప్రతినిధి నాగరాజ్ యాదవ్ సమన్వయంతో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రకళ మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలకు బదులుగా మట్టి విగ్రహాలను వినియోగించాలని ప్రజలకు సూచించారు. నిమజ్జనం సందర్భంగా నీటి కాలుష్యాన్ని నివారిస్తూ పర్యావరణహితంగా పండుగను జరుపుకోవాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్న నాగరాజ్ యాదవ్‌ను అభినందించారు. కార్యక్రమంలో శంషాబాద్ సర్కిల్ అధికారులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## మట్టితో గణపతి.. పర్యావరణానికి మేలు

**విద్యార్థులతో మట్టి గణపతి ప్రతిమల తయారీ**



హత్నూర, సెప్టెంబర్ 11 (నవజ్యోతి ప్రతినిధి): నస్తీపూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో మట్టి గణపతి ప్రతిమలను తయారు చేయించి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లోకనాథం ఆధ్వర్యంలో విద్యార్థులు మట్టి గణపతి ప్రతిమలను తయారు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. రసాయనాలు, కాలుష్య కారకాలతో తయారు చేసిన గణపతి ప్రతిమలను నీటిలో నిమజ్జనం చేయడం వల్ల జలకాలుష్యం ఏర్పడుతుందని తెలిపారు. విద్యార్థులకు మంచి విషయాలు బోధించడంతో పాటు వాటిని ఆచరణలో పెట్టేలా మట్టి గణపతి ప్రతిమలను తయారు చేయించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరేష్, వాలంటీర్ ప్రవళిక, లక్ష్మీబాయి, బాలమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

## 70వ స్కూల్ గేమ్స్ జోనల్ పోటీలు ఘనంగా ముగింపు

**జోనల్ పోటీల్లో సత్తా.. జిల్లా స్థాయి బరిలోకి క్రీడాకారులు**





కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 11 (నవజ్యోతి ప్రతినిధి): 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బాచుపల్లిలోని సూర్య గ్లోబల్ స్కూల్‌లో మూడు రోజులుగా నిర్వహించిన కుత్బుల్లాపూర్ జోనల్ స్థాయి క్రీడా పోటీలు, ఎంపికలు ఘనంగా ముగిశాయి. కబడ్డీ, ఖో–ఖో, వాలీబాల్‌లో అండర్–14, అండర్–17 బాలబాలికల విభాగాల్లో పోటీలు ఉత్సాహంగా జరిగాయి. చివరి రోజు వాలీబాల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. అనంతరం జరిగిన ముగింపు కార్యక్రమంలో సూర్య గ్లోబల్ స్కూల్ చైర్మన్ దామోదర్‌రావు, ప్రిన్సిపాల్ లక్ష్మీధరిత్రి విజేతలు, రన్నరప్‌లకు బహుమతులు అందజేశారు. కబడ్డీలో అండర్–17 బాలికల్లో TG MRI ES కుత్బుల్లాపూర్, బాలురలో ప్రగతి విద్యానికేతన్, అండర్–14 బాలికల్లో శాంతినికేతన్, బాలురలో సూర్య గ్లోబల్ స్కూల్ విజేతలుగా నిలిచాయి. ఖో–ఖోలో అండర్–17 బాలుర, అండర్–14 బాలుర, బాలికల విభాగాల్లో జీడిమెట్ల జెడ్పీహెచ్‌ఎస్ విజేతగా నిలవగా, అండర్–17 బాలికల్లో సూర్య గ్లోబల్ స్కూల్ విజేతగా నిలిచింది. వాలీబాల్‌లో అండర్–17 బాలికల్లో డీఎంఎస్, బాలురలో ప్రగతి సెంట్రల్ స్కూల్, అండర్–14 బాలుర, బాలికల విభాగాల్లో సిల్వర్ ఓక్స్ విజేతలుగా నిలిచాయి. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు తదుపరి స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో జోనల్ సెక్రెటరీ పి.నాగరాజుగౌడ్, పీడీలు వినోద్, విజయ్, రమేష్, సురేష్, సునీల్, వెంకట్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా నిర్వహించాలి

**ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి: బీజేపీ నాయకుల డిమాండ్**




మిర్యాలగూడ, సెప్టెంబర్ 11 (నవజ్యోతి ప్రతినిధి): సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ మిర్యాలగూడ వన్‌టౌన్ ఆధ్వర్యంలో ఆర్డీఓ రమణారెడ్డికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. బీజేపీ వన్‌టౌన్ అధ్యక్షుడు బంటుగిరి, ప్రధాన కార్యదర్శులు కొంగరి వెంకటరమణ, మూల రాజారెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనకు ముగింపు పలికేందుకు భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ పోలో సైనిక చర్యతో తెలంగాణ ప్రజలకు విముక్తి లభించిందని తెలిపారు. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నేతృత్వంలోని భారత ప్రభుత్వం తీసుకున్న చర్యల ఫలితంగా తెలంగాణ భారతదేశంలో విలీనమైందని పేర్కొన్నారు. ఈ చారిత్రక నేపథ్యాన్ని భవిష్యత్ తరాలకు తెలియజేసేలా సెప్టెంబర్ 17ను అధికారికంగా తెలంగాణ విమోచన దినోత్సవంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు రేపల్లె పురుషోత్తంరెడ్డి, అల్లం అశోక్, జిల్లా కార్యదర్శి చిల్లంచర్ల అభి, ఓబీసీ నాయకులు బంటు యాదగిరి, మండల సోములు, మహిళా మోర్చా పట్టణ అధ్యక్షురాలు గోనె కవితారెడ్డి, చిలుకూరి వెంకటేశ్వర్లు, మాజీ కౌన్సిలర్ చిలుకూరి శ్యాము, కౌన్సిలర్ వెలుగు ఇందిరా నాగరాజ్, కంచుకొమ్ముల వేణు తదితరులు పాల్గొన్నారు.

## 36 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

### హత్నూర రైతు వేదికలో ఘనంగా కార్యక్రమం



హత్నూర, సెప్టెంబర్ 11 (నవజ్యోతి ప్రతినిధి): ప్రభుత్వ పాఠశాలల్లో విశిష్ట సేవలు అందిస్తున్న మండలంలోని 36 మంది ఉత్తమ ఉపాధ్యాయులను శుక్రవారం హత్నూర రైతు వేదికలో ఘనంగా సన్మానించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీవో యూసుఫ్, ఎంఈఓ వెంకట్ నరసింహగౌడ్ ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధనతో పాటు ప్రత్యేక సేవలు అందిస్తున్న ఉపాధ్యాయులను గుర్తించి మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా సన్మానిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందని, వారిని ఉన్నత స్థాయికి తీసుకెళ్లేలా ఉపాధ్యాయులు మరింత కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండలంలోని పలు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బాధితులకు రూ.14.91 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



కూకట్‌పల్లి, సెప్టెంబర్ 11 (నవజ్యోతి ప్రతినిధి): ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్ప భరోసా అని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో అత్యవసర వైద్య చికిత్స కోసం సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్న 22 బాధిత కుటుంబాలకు రూ.14,91,300 విలువైన చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ఆపదలో ఉన్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఆపన్నహస్తంలా నిలుస్తోందన్నారు. ఆర్థిక స్థోమత లేక ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి ఈ సాయం ఎంతో భరోసా ఇస్తుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని స్పష్టం చేశారు. సాయం అందించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, గాంధీకి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంజీవరెడ్డి, నాయినేని చంద్రకాంత్‌రావు, జంగయ్య యాదవ్, చంద్రారెడ్డి, ఎండీ ఇబ్రహీం, జిల్లా గణేష్, క్రాంతి, మల్లయ్య, గోపాల్, శివసాగర్, సలావుద్దీన్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## 22ఏ జాబితా నుంచి భూములను తొలగించాలి



కూకట్‌పల్లి, సెప్టెంబర్ 11 (నవజ్యోతి ప్రతినిధి): 22ఏ జాబితాలో చేర్చిన భూముల సమస్య పరిష్కారమయ్యే వరకు తమ పోరాటం కొనసాగుతుందని బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు స్పష్టం చేశారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో కేపీహెచ్‌బీ డివిజన్ వసంత్‌నగర్, సర్దార్ పటేల్‌నగర్ కాలనీల ప్రతినిధులు వారిని కలిసి తమ సమస్యలను వివరించారు. 22ఏ జాబితా నుంచి తమ భూములను తొలగించాలని కోరారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లితో పాటు రాష్ట్రవ్యాప్తంగా 22ఏ జాబితాలో చేర్చిన భూములను వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కో–ఆర్డినేటర్ సతీష్ అరోరా, మాజీ కార్పొరేటర్లు మందాడి శ్రీనివాసరావు, ఆవుల రవీందర్‌రెడ్డి, పగడాల శిరీష్ బాబురావు, సబీహా గౌసుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి సర్కిల్‌కు 9 వేల మట్టి గణపతులు




కూకట్‌పల్లి, సెప్టెంబర్ 11 (నవజ్యోతి ప్రతినిధి): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మూసాపేట డీసీ శ్రీనివాసరెడ్డి కోరారు. కార్పొరేషన్ పరిధిలోని ప్రతి సర్కిల్‌కు 9 వేల మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మోతీనగర్ వార్డులో చేపట్టిన మట్టి గణపతుల పంపిణీని ఆయన పరిశీలించారు. తొలి విడతగా సర్కిల్‌కు 3 వేల విగ్రహాలు అందగా, వాటిని అన్ని వార్డుల్లో ప్రజలకు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. మిగిలిన విగ్రహాలు అందిన వెంటనే వార్డుల వారీగా పూర్తి స్థాయిలో పంపిణీ చేస్తామన్నారు. కాలుష్య రహితంగా వినాయక చవితి వేడుకలు నిర్వహించేందుకు ప్రజలంతా మట్టి గణపతులనే పూజించాలని శ్రీనివాసరెడ్డి సూచించారు.

## అంబీర్ చెరువు వద్ద నిమజ్జనం ఏర్పాట్ల పరిశీలన



కూకట్‌పల్లి, సెప్టెంబర్ 11 (నవజ్యోతి ప్రతినిధి): వినాయక నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అల్విన్ కాలనీ డీసీ చాముండేశ్వరి అధికారులను ఆదేశించారు. సిబ్బందితో కలిసి అంబీర్ చెరువు వద్ద నిమజ్జనం ఏర్పాట్లను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చెరువు పరిసరాల్లో విద్యుత్ దీపాలు, బారికేడింగ్, క్రేన్ల ఏర్పాటు, నిరంతర పారిశుధ్య పనులపై అధికారులకు సూచనలు చేశారు. నిమజ్జన ప్రక్రియ ఎలాంటి అవాంతరాలు లేకుండా ప్రశాంతంగా సాగేందుకు అన్ని విభాగాల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

### రామాయంపేటలో 19 మంది

# ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

### ఉపాధ్యాయులే భావి భారత నిర్మాతలు: మున్సిపల్ చైర్‌పర్సన్

రామాయంపేట, సెప్టెంబర్ 11 (నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్): ఉపాధ్యాయులే భావి భారత నిర్మాతలని రామాయంపేట మున్సిపల్ చైర్‌పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో మండలంలోని 19 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా లావణ్య నాగరాజు మాట్లాడుతూ విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి ఉన్నత లక్ష్యాల వైపు నడిపించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ, విలువలను నేర్పించాలని సూచించారు. ఎంఈఓ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తున్నారని, ఆంగ్ల మాధ్యమంలోనూ సమర్థంగా బోధిస్తూ విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారని కొనియాడారు. డిప్యూటీ తహసీల్దార్ నవీన్ మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్



కౌన్సిలర్లు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రాధిక, రఘునందన్‌రెడ్డి, ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, మండల వనరుల కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## కోర్టు యథాస్థితి ఆదేశాలు బేఖాతర్?

### వివాదాస్పద భూమిని చదును చేసి నిర్మాణ పనులు చేపట్టారంటూ ఫిర్యాదు



మిర్యాలగూడ, సెప్టెంబర్ 11 (నవజ్యోతి ప్రతినిధి): కోర్టులో వివాదం కొనసాగుతున్న భూమిపై యథాస్థితి కొనసాగించాలని ఆదేశాలు ఉన్నప్పటికీ, ట్రాక్టర్‌తో భూమిని చదును చేసి నిర్మాణ పనులు చేపట్టారంటూ శ్రీనివాస్‌నగర్‌కు చెందిన వల్లంశెట్టి దుర్గాభవాని మిర్యాలగూడ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనకు శ్రీనివాస్‌నగర్‌లో నాలుగున్నర గుంటల ఇంటి స్థలం ఉందని, దానికి సంబంధించి 15 ఏళ్లుగా న్యాయపోరాటం కొనసాగుతోందని ఆమె తెలిపారు. మిర్యాలగూడ సబ్‌కోర్టులో విచారణ అనంతరం తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందని, ప్రత్యర్థులు అప్పీల్‌కు వెళ్లడంతో సదరు భూమిపై యథాస్థితి కొనసాగించాలని కోర్టు ఆదేశించినట్లు పేర్కొన్నారు. ఈ నెల 24న తదుపరి వాయిదా ఉండగా, అంతకుముందే సర్పంచ్ వాసంశెట్టి మంగాదేవి భర్త గోవిందు ట్రాక్టర్‌తో భూమిని చదును చేసి నిర్మాణ పనులు చేపట్టారని ఆరోపించారు. కోర్టు ఆదేశాలు అమల్లో ఉండగా భూమి స్వరూపంలో మార్పులు చేయడం న్యాయస్థాన ఉత్తర్వుల ఉల్లంఘనేనని పేర్కొంటూ, ఘటనపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

## వినాయక నిమజ్జనం మురుగు నీటిలోనా..!

### నెక్నాంపూర్ పాండ్ ఏర్పాట్లపై బీజేపీ ఉత్సవ కమిటీ అసంతృప్తి



రాజేంద్రనగర్, సెప్టెంబర్ 11 (నవజ్యోతి ప్రతినిధి): వినాయక విగ్రహాల నిమజ్జనానికి గడువు సమీపిస్తున్నా నెక్నాంపూర్ పాండ్‌లో ఏర్పాట్లు ఆశించిన స్థాయిలో లేకపోవడంపై బీజేపీ ఉత్సవ కమిటీ సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. శుక్రవారం పాండ్ ప్రాంతాన్ని సందర్శించిన వారు అక్కడి పరిస్థితులను పరిశీలించారు. పాండ్‌లో మురుగు నీరు నిలిచి దుర్వాసన వస్తుండటంపై ఆందోళన వ్యక్తం చేశారు. నిమజ్జనానికి ముందే మురుగు నీటిని తొలగించి పాండ్‌ను శుభ్రం చేసి స్వచ్ఛమైన నీటిని నింపాలని కోరారు. నిమజ్జనానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున మౌలిక సదుపాయాలు, భద్రత, పారిశుధ్య ఏర్పాట్ల ను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. చివరి నిమిషంలో హడావుడి చేయకుండా నిమజ్జన సమయానికి ముందే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి పాండ్‌ను సిద్ధం చేయాలని అధికారులను కోరారు.

## నేరాల జోలికి వెళ్తే కఠిన చర్యలు

### అనుమానాస్పద వ్యక్తులకు పోలీసుల కౌన్సెలింగ్



కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 11 (నవజ్యోతి ప్రతినిధి): జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో అనుమానాస్పదంగా వ్యవహరిస్తున్న పలువురికి పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. డీఐ ధనుంజయ సూచనల మేరకు ఎస్‌హెచ్‌ఓ రవికుమార్ వారికి పలు సూచనలు చేశారు. శాంతియుతంగా జీవిస్తూ మంచి ప్రవర్తన కొనసాగించాలని, ఎలాంటి నేరాలు, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడవద్దని హెచ్చరించారు. పోలీసుల సూచనలను బేఖాతరు చేసి నేరాలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. నేరాలకు దూరంగా ఉంటూ సమాజంలో ప్రశాంత వాతావరణం నెలకొనేందుకు సహకరించాలని సూచించారు.

## గుండాల తండా విద్యార్థులకు అంకిత ఫౌండేషన్ చేయూత

### విద్యా సామగ్రి పంపిణీ.. ఎంఈఓ ఈ.వెంకట్‌కు ఘన సన్మానం



దోమ, సెప్టెంబర్ 11 (నవజ్యోతి ప్రతినిధి): దోమ మండలం గుండాల తండా పాఠశాలలో అంకిత ఫౌండేషన్ సౌజన్యంతో విద్యార్థులకు బ్యాగులు, మ్యాట్లు, షూస్‌తో పాటు ఇతర విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మండల విద్యాధికారి ఈ.వెంకట్ చేతుల మీదుగా విద్యార్థులకు సామగ్రి అందజేశారు. అనంతరం పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తున్న ఎంఈఓ ఈ.వెంకట్‌ను గ్రామస్తులు, ఉపాధ్యాయులు శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పార్వతమ్మ, హెచ్‌ఎం స్వాతి, గ్రామ పెద్దలు ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నరేష్, సీఆర్‌పీ రఘుసింగ్, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కూకట్‌పల్లిలో రూ.20 కోట్ల చిట్టీల మోసం

### 48 మంది బాధితులు.. ఇంటి ఎదుట ఆందోళన




కూకట్‌పల్లి, సెప్టెంబర్ 11 (నవజ్యోతి ప్రతినిధి): కూకట్‌పల్లిలో భారీ చిట్టీల మోసం వెలుగులోకి వచ్చింది. సాయి చరణ్ కాలనీకి చెందిన సీతమ్మ, రమణారెడ్డి దంపతులు చిట్టీల పేరుతో సుమారు రూ.20 కోట్లు వసూలు చేసి బోర్డు తిప్పేశారని బాధితులు ఆరోపించారు. రోజువారీ కూలీలు, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన సుమారు 48 మంది తమ కష్టార్జితాన్ని చిట్టీల్లో పెట్టుబడిగా పెట్టినట్లు తెలిపారు. గడువు ముగిసినా డబ్బులు తిరిగి చెల్లించకుండా తప్పించుకు తిరుగుతున్నారని, పైగా బాధితులకే కోర్టు ద్వారా నోటీసులు పంపడంతో వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. మోసపోయామని గ్రహించిన బాధితులు దంపతుల ఇంటి ఎదుట ఆందోళనకు దిగి పోలీసులను ఆశ్రయించారు. తమ కష్టార్జిత సొమ్మును తిరిగి ఇప్పించి, దంపతులపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని పోలీసులను కోరారు.<

## మాజీ సర్పంచ్ కుటుంబానికి కాంగ్రెస్ నేతల పరామర్శ



దోమ, సెప్టెంబర్ 11 (నవజ్యోతి ప్రతినిధి): దోమ మండలం బాస్‌పల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ అత్తగారు మృతి చెందడంతో కాంగ్రెస్ పార్టీ దోమ మండల అధ్యక్షుడు డి.శాంతకుమార్, బాస్‌పల్లి సర్పంచ్ అనంతయ్య ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతురాలి కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.

# కేజీబీవీ విద్యార్థినులకు బాలికల భద్రతపై అవగాహన



మాడుగులపల్లి, సెప్టెంబర్ 11 (నవజ్యోతి ప్రతినిధి): నల్గొండ భరోసా కేంద్రం ఆధ్వర్యంలో మాడుగులపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులకు బాలికల భద్రత, హక్కులు, వ్యక్తిగత రక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గుడ్‌టచ్–బ్యాడ్‌టచ్, బాలికలపై లైంగిక వేధింపులు, దాడుల నుంచి రక్షణకు ఉద్దేశించిన బాలలపై లైంగిక నేరాల నిరోధక చట్టం తదితర అంశాలను వివరించారు. ఎవరైనా వేధించినా, ఇబ్బందులకు గురిచేసినా భయపడకుండా వెంటనే పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు లేదా నమ్మకమైన వ్యక్తులకు సమాచారం అందించాలని సూచించారు. అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలని, సెల్‌ఫోన్, సామాజిక మాధ్యమాలను బాధ్యతాయుతంగా వినియోగిస్తూ వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులతో పంచుకోకూడదని తెలిపారు. విద్యార్థినులు చదువుపై శ్రద్ధ పెట్టి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో భరోసా సిబ్బంది శైలజ, నవ్య, పాఠశాల ప్రత్యేక అధికారి సునీత, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

# చేనేత సమస్యలపై శాసనమండలిలో గళమెత్తిన ఎమ్మెల్సీ ఎల్.రమణ



హైదరాబాద్, సెప్టెంబర్ 11 (నవజ్యోతి ప్రతినిధి): తెలంగాణలో నేత కార్మికులు, చేనేత రంగం ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్సీ ఎల్.రమణ శాసనమండలిలో ప్రస్తావించి ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. 16 నెలలుగా పెండింగ్‌లో ఉన్న త్రిఫ్ట్ ఫండ్ నిధులతో పాటు మూడు నెలలుగా నిలిచిపోయిన చేనేత చేయూత నిధులను వెంటనే విడుదల చేయాలని కోరారు. నేతన్న భీమా ప్రీమియం నిధులు విడుదల చేయకపోవడంతో పథకం అమలుకు ఆటంకం ఏర్పడిందని, అవసరమైన నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. చేనేత సహకార సంఘాల్లో పేరుకుపోయిన వస్త్రాలను టెక్స్‌కో ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేసి కార్మికులకు ఉపాధి కల్పించాలని సూచించారు. చేనేత కార్మికులకు ప్రకటించిన రూ.లక్ష రుణమాఫీని అర్హులందరికీ వర్తింపజేయాలని, సున్నా వడ్డీ నిధులు విడుదల చేసి కొత్త రుణాలు అందేలా చూడాలని కోరారు. ఇటీవల ఎన్నికలు జరిగిన సహకార సంఘాలకు ఉత్పత్తి ఆర్డర్లు కేటాయించి నిరంతర ఉపాధి కల్పించాలని, 60 ఏళ్లు దాటిన నేత కార్మికులకు సహాయక నిధులు అందించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే చేనేత సంఘాల గుర్తింపు కార్డుల ఆధారంగా 50 ఏళ్లు దాటిన నేత కార్మికులందరికీ పింఛన్లు అందించాలని ఎల్.రమణ ప్రభుత్వాన్ని కోరారు.

# ఎస్జీఎఫ్ జిల్లా స్థాయి పోటీలకు మోరపల్లి విద్యార్థులు ఎంపిక



మోరపల్లి, సెప్టెంబర్ 11 (జగిత్యాల జిల్లా బ్యూరో): మోరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కోకోలో సాయి సమర్థ, కబడ్డీలో కొలిపాక మనోజ్‌కుమార్, అండర్–17 విభాగంలో 1500 మీటర్ల పరుగు పందెంలో మేడవేణి రిషిందర్, అండర్–14లో 600 మీటర్ల పరుగు పందెంలో శ్రీ సన్నిధి, 200 మీటర్ల పరుగు పందెంలో సాత్విక్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను పీఈటీ సుప్రియ, సీనియర్ ఉపాధ్యాయులు ఏవీఎన్ రాజు, ప్రధానోపాధ్యాయులు బన్నా, గ్రామ సర్పంచ్ కట్ట రాజేందర్, ఉపసర్పంచ్ గంగ రాజం అభినందించారు. జిల్లా స్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబరిచి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# కృష్ణా నీటికి ప్రత్యామ్నాయంగా బోరు

## ఎమ్మెల్యే సహకారంతో శాశ్వత చర్యలు



యాదాద్రి, సెప్టెంబర్ 11 (నవజ్యోతి): హైదరాబాద్ నుంచి సరఫరా అయ్యే కృష్ణా జలాల సరఫరాలో ఎలాంటి అంతరాయం ఏర్పడినా వార్డు ప్రజలకు తాగునీటి ఇబ్బందులు ఉండొద్దని కౌన్సిలర్ పూజిత జహంగిర్ అన్నారు. జిల్లా కేంద్రం భువనగిరి 23వ వార్డులో ప్రజల నీటి అవసరాలు తీర్చేందుకు బోరు వేసిన సందర్భంగా ఆమె మాట్లాడారు. కృష్ణా జలాల సరఫరా నిలిచిపోతే ప్రజలకు నీటి కోసం ఇబ్బందులు తొలగించేందుకే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామన్నారు. ప్రజలకు తాగునీరు అందించడం ప్రభుత్వంతో పాటు ప్రజాప్రతినిధుల ప్రాథమిక బాధ్యత అన్నారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో వార్డులో మౌలిక వసతులను మెరుగుపరుస్తానన్నారు. నీటి సరఫరా ఆగినా ప్రజల దాహం తీరాలనే లక్ష్యంతో బోరు వేయించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బండారు రవివర్ధన్, వార్డు పెద్దలు నువ్వుల నరసింహ, తోట నారాయణ, నాయిని కృష్ణమూర్తి, నాయిని వెంకటేష్, తోట మహేందర్, తాడెం శ్రీధర్, నాయిని శ్రవణ్‌కుమార్, గోపే బాబు, భూషపాక ఈశ్వర్‌బాబు, బర్రె క్రాంతి, వార్డు మహిళలు పాల్గొన్నారు.

# జిల్లా ఖజానా కార్యాలయంలో వార్షిక తనిఖీ

**ఖజానా నిర్వహణలో నిబంధనలు, పారదర్శకత, జవాబుదారీతనం పాటించాలి**

**సీనియర్ డీఏజీ ఎం. నరేష్ కుమార్**



సంగారెడ్డి, సెప్టెంబర్ 11 (నవజ్యోతి ప్రతినిధి) :తెలంగాణ రాష్ట్ర సీనియర్ డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ ఎం. నరేష్ కుమార్ ( ఇండియన్ ఆడిట్ అండ్ అకౌంట్స్ సర్వీసెస్ అధికారి) శుక్రవారం సంగారెడ్డి జిల్లా ఖజానా కార్యాలయంలో వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈనెల 7 నుండి కొనసాగుతున్న వార్షిక ఆడిట్‌లో భాగంగా చివరి రోజున ఆయన కార్యాలయాన్ని సందర్శించి, వివిధ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా ఖజానా శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్‌తో పాటు జిల్లాలో పనిచేస్తున్న ఏటీఓలు, ఎస్‌టీఓలతో ఆయన సమావేశమై ఖజానా నిర్వహణ, ఆడిట్ అంశాలు, కార్యాలయ విధులపై సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న ఆడిట్ అభ్యంతరాలు (Outstanding Audit Paras), ప్రస్తుత ఆడిట్ అభ్యంతరాలు తదితర అంశాలను పరిశీలించారు.ఈ సందర్భంగా నరేష్ కుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆర్థిక లావాదేవీల నిర్వహణలో నిబంధనలు, విధివిధానాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. IFMIS పోర్టల్ ద్వారా పేపర్‌లెస్ ఆన్‌లైన్ బిల్లుల సమర్పణ జరుగుతున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు, సిబ్బంది విధి విధానాలను పూర్తిగా అవగాహన చేసుకొని, ఎలాంటి లోపాలకు తావులేకుండా బిల్లుల ప్రక్రియను నిర్వహించాలని సూచించారు.పెన్షనర్లకు సంబంధించిన పెన్షన్ల చెల్లింపుల ప్రక్రియను సక్రమంగా, సకాలంలో నిర్వహించాలని, అదేవిధంగా నెలవారీ అకౌంట్స్ నిర్ణీత గడువులోగా అకౌంటెంట్ జనరల్ కార్యాలయానికి సమర్పించాలని సూచించారు.ఖజానా కార్యాలయాల్లో రికార్డులు, రిజిస్టర్లు, ఆర్థిక లావాదేవీల వివరాలను ఎప్పటికప్పుడు సక్రమంగా నమోదు చేసి భద్రపరచాలని, ప్రభుత్వ నిధుల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం, ఆర్థిక క్రమశిక్షణ పాటించాలని సూచించారు. జిల్లా ఖజానా కార్యాలయంలో రికార్డుల నిర్వహణ, విధుల అమలు, ఆడిట్ ప్రక్రియకు సంబంధించి చేపడుతున్న చర్యలపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఖజానా శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్, ఏ టి ఓ లు, ఎస్‌టీఓలు సంపత్ స్వరూప్, రాజారెడ్డి, శారద, ఏటీఓలు, జిల్లా ఖజానా కార్యాలయంలోని వివిధ విభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు.

## 18-55 ఏళ్ల బీసీ మహిళలకు

# ఉచిత కుట్టు మిషన్ల పంపిణీ

**ఈ నెల 15లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి**



సంగారెడ్డి, సెప్టెంబర్ 11 (నవజ్యోతి ప్రతినిధి) :జిల్లాలోని బీసీ మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రోత్సాహం అందించేందుకు ఇంటింటికి ఇందిరమ్మ కుట్టు మిషన్ల పంపిణీ పథకం కింద ఉచిత కుట్టు మిషన్ల పంపిణీకి అర్హులైన మహిళలు సెప్టెంబర్ 15లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.అర్హులైన మహిళలు http://tgobmms.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకొనుటకు ఈ నెల 15 చివరి తేదీ అని తెలిపారు.దరఖాస్తుదారుల వయస్సు 18 నిండి 55 సంవత్సరాల లోపు ఉండాలని, నిరుద్యోగ మహిళలు, నిరుపేదలు, నిరాధారణకు గురైన వితంతు, ఒంటరి, వికలాంగులు, అనాథ మహిళలకు, టైలరింగ్ ట్రైనింగ్ సర్టిఫికెట్ ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు.నివాసం, కులం, ఆదాయం, ఆధార్, విద్యార్హత, టైలరింగ్ శిక్షణకు సంబంధించిన ధ్రువపత్రాలు, తెల్ల రేషన్ కార్డ్ లేదా ఆహార భద్రత కార్డు కలిగి ఉండాలని, కనీస అక్షరాస్యత తప్పనిసరి అని, ఎక్కువ దరఖాస్తులు వస్తే కనీస విద్యార్హత ఐదవ తరగతి పాసైన వారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. కుటుంబంలో ఒకరికి మాత్రమే అవకాశం ఉంటుందని, కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణులకు 1.50 లక్షలు, పట్టణ వాసులకు రెండు లక్షల లోపు ఉన్నవారు అర్హులని తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో బీసీ స్వయం ఉపాధి పథకం కింద ఆర్థిక లబ్ధి పొందిన వారు అర్హులు కాదని స్పష్టం చేశారు. దరఖాస్తుదారులు దరఖాస్తులను సంబంధిత వెబ్సైట్ నుండి డౌన్లోడ్ చేసుకుని కుల, ఆదాయ, నివాస, ఆధార్ కార్డు, రేషన్ కార్డ్, విద్యార్హతలు, టైలరింగ్ శిక్షణ, అనుభవం తదితర ధ్రువీకరణ పత్రాలతో గ్రామీణులు సంబంధిత మండల పరిషత్ అభివృద్ధి అధికారికి, పట్టణ ప్రాంతవాసులు సంబంధిత మున్సిపల్ కమిషనర్లకు ఈ నెల 15లోగా దరఖాస్తులు సమర్పించాలని కలెక్టర్ సూచించారు.

# బీఆర్ఎస్ అరాచకానికి ప్రజలే బుద్ధి చెబుతారు

**దళితులను అవమానిస్తే భారీ మూల్యం తప్పదు: నిర్మలా జగ్గారెడ్డి**

సంగారెడ్డి, సెప్టెంబర్ 11 (నవజ్యోతి ప్రతినిధి): అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వ్యవహరించిన తీరును నిరసిస్తూ డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి ఆధ్వర్యంలో గురువారం సంగారెడ్డిలో కాంగ్రెస్ శ్రేణులు ర్యాలీ నిర్వహించాయి. రామ్‌నగర్‌లోని జగ్గారెడ్డి నివాసం నుంచి పాతబస్టాండ్ అంబేద్కర్ చౌరస్తా వరకు నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా వెళ్లారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి నిర్మలా జగ్గారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చించాల్సిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారని ఆరోపించారు. పోలీసులపై దాడికి పాల్పడి తిరిగి తామే బాధితులమన్నట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు.దళితులు నడిచిన ప్రదేశాన్ని పసుపు, తులసి నీటితో శుద్ధి చేసినట్లు వచ్చిన ఘటనను నిర్మలా జగ్గారెడ్డి తీవ్రంగా ఖండించారు. ఇటువంటి చర్యలు దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని, రాష్ట్ర ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని పేర్కొన్నారు. దళితులను అవమానించే రాజకీయాలకు ప్రజలే తగిన సమాధానం చెబుతారని



అన్నారు.కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత కిషన్, మున్సిపల్ చైర్‌పర్సన్ కూన వనితా సంతోష్, సీడీసీ చైర్మన్ రామ్‌రెడ్డి, జార్జ్, కిరణ్‌గౌడ్, సంతోష్, శ్రీకాంత్, రామ్‌చందర్ నాయక్, శ్రీకాంత్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, భూమేష్ తదితరులు పాల్గొన్నారు.